రానున్న (2025-26) ఆర్థిక సంవత్సరంలో తిరుపతి జిల్లా అభివృద్ధికి ఎలాంటి ప్రణాళికలు చేపట్టనున్నారు? శాఖలవారీగా నిర్దేశించుకున్న లక్ష్యాలేవీ? వీటిని అధిగమించేందుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం కావాలి? వీటన్నింటినీ కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అమరావతిలో రెండో రోజైన బుధవారం జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్సులో జిల్లా అభివృద్ధి ప్రణాళికలపై సీఎం చంద్రబాబు సమీక్షించారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

తిరుమల, తిరుపతికి హరిత ఛత్రం



సదస్సులో పాల్గొన్న కలెక్టర్ వెంకటేశ్వర్

- గ్లోబల్ వెడ్డింగ్ డెస్టినేషన్‌గా తిరునగరం
- మామిడి నుంచి విలువైన ఇతర పంటల సాగుకు రైతుల మళ్లింపు
- బిందు సేద్యంతో ఉద్యాన పంటల సాగు విస్తరణ
- సీఎం సమీక్షలో జిల్లా ప్రణాళిక, లక్ష్యాలు నివేదించిన కలెక్టర్

తిరుమల, తిరుపతికి హరిత ఛత్రం ఏర్పాటు చేయాలని జిల్లా యంత్రాంగం ప్రణాళిక రూపొందించింది. తిరుమల కొండలపై అడవుల విస్తీర్ణాన్ని 68 నుంచి ఈ ఏడాది 75 శాతానికి పెంచనుంది. ఆపై విడతలవారీగా 90 శాతానికి చేర్చనుంది. తిరుపతి నగరంలోనూ 15 లక్షల మొక్కలు నాటి సామాజిక వనాల ఏర్పాటుదిశగా ప్రణాళిక సిద్ధం చేసుకుంది. కమ్యూనిటీ బేస్డ్ ఎకో టూరిజం అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడంలో భాగంగా తిరుపతిలో నగరవనాన్ని మరింత అభివృద్ధి చేయనుంది. వీలైన చోట్ల పచ్చదనం పెంచేలా చర్యలు తీసుకోనుంది. మరోవైపు వివాహాలు, నిశ్చితార్థాలకు ప్రస్తుత తరం పర్యాటక ప్రాంతాలను ఎంచుకుంటోంది. ఈ క్రమంలో తిరుపతిని గ్లోబల్ వెడ్డింగ్ డెస్టినేషన్‌గా అభివృద్ధి పరచాలని జిల్లా యంత్రాంగం నిర్ణయం తీసుకుంది. ఇతర వినోదాల పరంగానూ తిరుపతిని తీర్చిదిద్దాలని భావిస్తోంది. మరో ఏడు ఫైవ్ స్టార్ హోటళ్ల నిర్మాణం కానున్నాయి. వాటిలో ఒబెరాయ్, హయత్, మారియట్, అట్మోస్పియర్ వంటివి ఉన్నాయి. తిరుపతి వచ్చే యాత్రికులు రెండు రోజుల పాటు నగరంలో గడిపేలా లగ్జరీ గదుల సంఖ్యను రెట్టింపు చేయాలని, తద్వారా 4700 మందికి కొత్తగా ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది. పర్యాటకంగా తిరుపతిని అభివృద్ధి పరిచేందుకు నగరంలోని అనేక చెరువులనూ ఆధునికీకరించి 'సిటీ ఆఫ్ ట్యాంక్స్'గా మార్చాలని ప్రతిపాదించింది.

డ్రాగన్ ఫ్రూట్, అవకాడో సాగుకు మళ్లింపు

సాగు విస్తీర్ణం పెంచడంతో పాటు పంటల మార్పిడిని ప్రోత్సహించడం, కొత్త రకాలను పరిచయం చేయడం, ఉద్యాన పంటలను బిందు సేద్యం కిందకు తేవడం వంటి నిర్ణయాలను యంత్రాంగం తీసుకుంటోంది. ఈ ఏడాది మామిడి సాగు నుంచి రైతులను డ్రాగన్ ఫ్రూట్, అవకాడో వంటి విలువైన పంటల సాగువైపు మళ్లించేందుకు ప్రయత్నించనుంది. ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం ఈ ఏడాది 29,349 హెక్టార్ల నుంచీ 8 శాతానికి అంటే 31,803 హెక్టార్లకు పెంచాలని లక్ష్యం విధించుకుంది. ఫార్మర్స్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్ ద్వారా ఈ కార్యక్రమం అమలు చేయనుంది. ఉత్తమ పంట సాగు విధానాలను అమలు పరిచేలా 500 హెక్టార్లలో ఎగుమతులకు అవకాశం కల్పించనుంది. బిందు సేద్యం కింద ప్రస్తుతమున్న 20,650 హెక్టార్లను 23750 కు పెంచాలని లక్ష్యం నిర్దేశించుకుంది. ఇలా 15 శాతం విస్తీర్ణం పెంపుతో పాటు దిగుబడినీ 25 శాతం పెంచాలని లక్ష్యం పెట్టుకుంది. పంటకోతల అనంతరం మద్దతు చర్యల్లో భాగంగా 2 వేల హెక్టార్ల పంట దిగుబడులను నిల్వ ఉంచడానికి గోదాములు, కోల్డ్ స్టోరేజీ ప్లాంట్లు, రైపనింగ్ యూనిట్లు, ఇంటిగ్రేటెడ్ యూనిట్లు ఏర్పాటు చేయనుంది.

డ్రోన్ల వినియోగంతో లక్ష ఎకరాల సాగు

ఈ ఏడాది ప్రకృతి వ్యవసాయాన్ని 21.53 శాతం నుంచీ 34.32 శాతానికి పెంచాలని లక్ష్యం నిర్దేశించుకుంది. అదే సమయంలో హెక్టారుకు పంట సాగు వ్యయం కనీసం రూ.2 వేలు చొప్పున తగ్గించే కార్యక్రమాన్ని 25 వేల ఎకరాలకు అమలు చేయనుంది. దానికి సమాంతరంగా వ్యవసాయంలో యాంత్రికీకరణకు ప్రాధాన్యమిచ్చింది. 33 వేల మంది రైతులకు సంబంధించిన లక్ష ఎకరాల్లో పంటల సాగుకు డ్రోన్లు వినియోగించాలని నిర్ణయించింది. దీనికి 37 డ్రోన్లు సమకూర్చనుంది.

పాల దిగుబడి, మాంసం ఉత్పత్తుల పెంపు

పాడి పశువుల వ్యాక్సినేషన్, డీ వార్మింగ్ కార్యక్రమాలను పెద్ద ఎత్తున కొనసాగించడంతో పాటు 20 వేల పశువులకు కృత్రిమ గర్భధారణ వంటి కార్యక్రమాలు చేపట్టనుంది. అంతిమంగా జిల్లాలో ఈ ఏడాది పాడియావుకు రోజుకు సగటు పాల దిగుబడిని 7.65 లీటర్ల నుంచీ 8.25 లీటర్లకు పెంచాలని లక్ష్యం నిర్దేశించుకుంది. మాంసం ఉత్పత్తులను ఇపుడున్న 40,650 టన్నుల నుంచీ ఏడు శాతం పెంచేలా లక్ష్యాన్ని పెట్టుకుంది.

పూడిరాయి దొరువు పూడిక తీత... చేపల రేవు


వాకాడు మండలంలోని పూడిరాయి దొరువు వద్ద సముద్ర ముఖద్వారాల పూడికతీతకు రూ.97.09 కోట్లు మంజూరయ్యాయి. అదే చోట మోడెర్న్ ఇంటిగ్రేటెడ్ ఫిష్ ల్యాండింగ్ సెంటర్ (చేపల రేవు) నిర్మాణానికి రూ. 23.90 కోట్లు కేంద్రం మంజూరు చేసింది. ఏపీ మ్యారిటైమ్ బోర్డు ద్వారా ఈ ఏడాదిలో వీటిని పూర్తి చేయాలని అధికార యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకుంది. జిల్లాలో 1987 ఎకరాల ఆక్వా కల్చర్ సాగు విస్తీర్ణాన్ని ఆక్వా జోన్ పరిధిలోకి తీసుకెళ్లాలని నిర్ణయించింది. 20 వేల మంది మత్స్యకారులకు ఆదాయం పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రధానమంత్రి మత్స్యకార సమృద్ధి యోజన కింద మత్స్యకారులకు బోట్లు, వలలు, ఇంజిన్లు కొనుగోలు చేసేందుకు 365 రుణ యూనిట్లు అమలు చేయాలని లక్ష్యం నిర్దేశించుకుంది.

రైల్వే ప్రాజెక్టులకు భూసేకరణపై దృష్టి

గూడూరు- రేణిగుంట, ఏర్పేడు-పూడి రైల్వే లైన్ల కోసం 108 కిలోమీటర్ల మేరకు 135 హెక్టార్ల భూసేకరణ పూర్తయింది. నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైన్ నిర్మాణ పనులు ప్రారంభించి వచ్చే ఏడాది మార్చిలోగా 20శాతం పనులు పూర్తి చేయాలని లక్ష్యం పెట్టుకుంది.దీర్ఘకాలిక పెండింగ్‌లో వున్న రేణిగుంట బైపాస్, ఎల్‌సీ36, ఎల్‌సీ 95లను ఈ ఏడాది పూర్తి చేయాలని నిర్ణయించింది.దీనివల్ల రేణిగుంట మీదుగా రైలు ప్రయాణాలకు సమయం తగ్గనుంది.

అయోధ్య తరహాలో తిరుపతి అభివృద్ధి కావాలి

- కలెక్టర్ల కాన్ఫరెన్సులో సీఎం చంద్రబాబు



'అయోధ్యలో ఇళ్లు నిర్మించుకుని స్థిరపడేందుకు దేశవ్యాప్తంగా పలువురు సిద్ధపడుతున్నారు. అదే తరహాలో తిరుపతిలో స్థిరపడేందుకు ప్రజలు తొలి ప్రాధాన్యతతో ఎంచుకునేలా తీర్చిదిద్దాలి. ఆ దిశగా చర్యలు తీసుకోవాలి' అని జిల్లా యంత్రాంగాన్ని సీఎం చంద్రబాబు ఆదేశించారు. కలెక్టర్ల సదస్సులో ఆయన జిల్లా అభివృద్ధిపై సమీక్షించారు. జాతీయ రహదారులు, పోర్టులు, విమానాశ్రయం, శ్రీసిటీ వంటి పారిశ్రామికవాడ ఉన్న తిరుపతి గరిష్ఠంగా అభివృద్ధి చెందడానికి అవకాశమున్న నగరంగా సీఎం అభివర్ణించారు. దేశ నలుమూలల నుంచీ వచ్చే యాత్రికులు బస చేయడానికి అనువుగా కనీసం ఐదు వేల హోటల్ గదులు అందుబాటులో ఉండాలన్నారు.అనువైన భూములు, స్థలాలు గుర్తించి అందుబాటులోకి తెస్తే హోటళ్ల నిర్మాణానికి ముందుకొచ్చే వారితో మాట్లాడదామన్నారు. తిరుపతిలో హోటళ్లు,కన్వెన్షన్ సెంటర్లు, మ్యారేజీ హాళ్లు గణనీయంగా నిర్మాణం కావాలన్నారు. ఎక్కడెక్కడి నుంచో తిరుపతి వచ్చి వివాహాలు చేసుకునేలా వెడ్డింగ్ డెస్టినేషన్‌గా అభివృద్ధి చేయాలని సూచించారు. దానికో సం టీటీడీకి కూడా తగిన ఆదేశాలిస్తామన్నారు.

ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం చేపడతాం

డక్కిలి మండలంలోని అల్తూరుపాడు, రేణిగుంట మండలంలో బాలాజీ రిజర్వాయర్‌తో పాటు మల్లిమడుగు రిజర్వాయర్ ఆధునికీకరణ పనులు చేపడతామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. పులికాట్‌లోకి సముద్ర నీరు సమృద్ధిగా వచ్చేలా వాకాడు మండలం పూడిరాయిదొరువు వద్ద సముద్ర ముఖద్వారాల పూడిత తీత పనులు త్వరితగతిన ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మామిడి రైతుల సమస్యలు పరిష్కరించాలన్నారు. కడప-రేణిగుంట, పీలేరు-కాలూరు జాతీయ రహదారుల నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు వచ్చేలా చూడాలన్నారు. అన్ని నియోజకవర్గాల్లో జాబ్ మేళాలు నిర్వహించాలన్నారు. నాలుగో జోన్‌లో ఉన్న తిరుపతి జిల్లాలో వృద్ధి రేటు 12.08 శాతం నమోదు కావడంపట్ల సంతృప్తి వ్యక్తం చేసిన సీఎం.. దాన్ని 15 శాతానికి పెంచాలని కలెక్టర్‌ను ఆదేశించారు. జోన్ పరిధిలో తలసరి ఆదాయంలో జిల్లా ప్రథమ స్థానంలో ఉందంటూ అభినందించారు.

ముక్కంటి ఆలయ హుండీ లెక్కింపులో చోరీ

- తిరుపతి మహిళ అరెస్టు
- రూ.98.50 వేల నగదు స్వాధీనం



పోలీసుల అదుపులో లావణ్య

శ్రీకాళహస్తి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ లెక్కింపులో ఓ మహిళ రూ.98.50 వేలను చోరీచేసి పట్టుబడింది. ఈ దఫా మహాశివరాత్రి ఉత్సవాలు జరగడంతో నగదు అధికంగా ఉండటంతో గురుదక్షిణామూర్తి సన్నిధిలో జరగాల్సిన హుండీ లెక్కింపును అధికారులు అదనపు రూ.500 రాహుకేతు పూజామండపంలోకి మార్చారు. భ్రమరాంబిక సేవా సమితి ద్వారా కొందరు సేవకులను హుండీ లెక్కింపునకు నియమించారు. మధ్యాహ్నం భోజన విరామం కోసం కొందరు వెలుపలకు వెళ్తుండగా ఆలయ భద్రతా సిబ్బంది తనిఖీలు చేశారు. తిరుపతికి చెందిన లావణ్య తాను షుగర్ పేషెంట్‌నని, డైపర్ తప్పక ధరించాలని చెప్పి ఉదయం హుండీ లెక్కింపునకు హాజరయ్యారు. మధ్యాహ్నం భోజన విరామానికి వెళ్లే సమయంలో జరిపిన తనిఖీల్లో ఆమె డైపర్‌లో నగదు దాచినట్లు గుర్తించారు. వెంటనే శ్రీకాళహస్తి వన్ టౌన్ పోలీసులకు అప్పగించారు. రూ.98,500 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆలయ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రికార్డుస్థాయిలో రూ.2.58కోట్ల హుండీ ఆదాయం

శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయం రికార్డుస్థాయిలో నమోదైంది. గతేడాది శివరాత్రి సమయంలో హుండీ లెక్కింపు ద్వారా రూ.2.16కోట్లు చేకూరింది. ఈ ఏడాది రూ.2.58 కోట్లతో సరికొత్త రికార్డు నమోదైంది. బుధవారం జరిపిన హుండీ లెక్కింపులో రూ.2,58,89,511 వచ్చింది. ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ద్వారా బంగారం 132 గ్రాములు, వెండి 714.300 కిలోలు, విదేశీ కరెన్సీ 193 వచ్చింది. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులను వేధించిన ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్ల సస్పెన్షన్

తిరుపతి(వైద్యం), మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వైద్యకళాశాల పరిధిలోని రుయాస్పత్రిలో పారా మెడికల్ విద్యార్థినులను లైంగికంగా వేధించిన ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లను ప్రిన్సిపల్ చంద్రశేఖరన్ బుధవారం సస్పెండు చేశారు. ల్యాబ్ టెక్నీషియన్లు వెంకటప్రసాద్, రాజశేఖర్‌నాయక్ కొద్ది రోజులుగా లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు ల్యాబ్‌లోని కొందరు పారా మెడికల్ విద్యార్థినులు వారం కిందట ప్రిన్సిపల్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ సభ్యులు వారం రోజులుగా విచారించి.. బుధవారం నివేదిక అందించింది. ఈ మేరకు ల్యాబ్ టెక్నీషియన్లు వెంకటప్రసాద్, రాజశేఖర్‌నాయక్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:27 (గురువారం సాయంత్రం)
సహర్: 4:52 (శుక్రవారం ఉదయం)

ముత్యాలమ్మా.. కాపాడమ్మా!

- తూర్పుకనుపూరులో జాతర సందడి
- కొలువైన పోలేరమ్మ



పుష్పాలంకారంలో దర్శనమిచ్చిన ముత్యాలమ్మ



పోలేరమ్మ దర్శనానికి బారులు తీరిన భక్తులు



కొలువైన పోలేరమ్మ తల్లి

చిల్లకూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): 'కోర్కెలు తీర్చే కల్పవల్లి.. కరుణించి కాపాడమ్మా' అంటూ ముత్యాలమ్మను భక్తులు వేడుకున్నారు. చిల్లకూరు మండలం తూర్పుకనుపూరులో అమ్మవారి జాతర సందర్భంగా రెండో రోజైన బుధవారం భక్తుల రద్దీ మరింత పెరిగింది. జాతరలో భాగంగా పోలేరమ్మ అమ్మవారిని ఊరేగింపుగా తీసుకొచ్చి ముత్యాలమ్మ ఆలయానికి తూర్పు దిశలో ఏర్పాటుచేసిన తాత్కాలిక గుడిసెలో ప్రతిష్ఠించారు. పోలేరమ్మ మట్టి ప్రతిమతో పాటు సత్తి పోలేరమ్మ, అంకమ్మ, సిద్దయ్య, పరుశురాముడు విగ్రహాలను ఊరేగించారు. పోలేరమ్మను, ముత్యాలమ్మను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాలనుంచీ భక్తులు తరలి వచ్చారు. అమ్మవారు (ఆటలమ్మ) పోసిన భక్తులంతా మొక్కులు తీర్చుకునేందుకు రావడంతో రద్దీ నెలకొంది. నెత్తిమీద పెట్టుకున్న వేయికండ్ల కుండ, అందులో గండ దీపం, మొలకు వేపచీర, పడిగళ్లు, నవధాన్యాలు, ఎర్రగడ్డలు, కోడిపిల్లలను గుడి పైకి విసిరి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం యార, శీగురునాథస్వామి, అంకమ్మ దేవతల గ్రామోత్సవాన్ని నిర్వహించారు. గొల్లల వేడుకల్లో భాగంగా గంగపెట్టె, వీరతాళ్లతో వీధులలో తిరిగారు. పెద్ద గొల్ల చిందులు, గణాచారి నాట్యం సందడి చేశాయి. రాత్రి అమ్మవారికి ఉయ్యాల సేవ నిర్వహించారు. మూడో రోజైన గురువారం భక్తుల సంఖ్య అధికంగా ఉంటుందని, అందుకు తగ్గ ఏర్పాట్లు చేశామని ఈవో నవీన్‌కుమార్ తెలిపారు.



యార, గురునాధస్వామి, అంకమ్మల గ్రామోత్సవం - ముత్యాలమ్మ ఆలయం ఎదుట త్రిశూలం వద్ద మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



ఎంపీపీ, రెండు ఉపసర్పంచి స్థానాలకు నేడు ఎన్నికలు

వార్డు సభ్యుల మృతితో మరో రెండు చోట్ల ఉపసర్పంచి ఎన్నిక వాయిదా

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ కారణాలతో ఖాళీ అయిన తిరుపతి రూరల్ ఎంపీపీతో పాటు నాలుగు ఉప సర్పంచి స్థానాలకు వారం క్రితం ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే, గురువారం తిరుపతి రూరల్ ఎంపీపీ. చంద్రగిరి మండలం రామిరెడ్డిపల్లి, ఎర్రావారిపాళెం మండలం చింతగుంటలో మాత్రమే పరోక్ష విధానంలో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు నామినేషన్ల స్వీకరణతో మొదలై మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రమాణస్వీకారంతో ముగియనుంది. ఇక, రేణిగుంట మండలం గురవరాజుపల్లి, కోట మండలం ఎన్‌పీ కొత్తపాళెంలో వార్డు సభ్యుల మృతితో ఉపసర్పంచ్ ఎన్నిక వాయిదా వేస్తున్నట్లు డీపీవో సుశీలాదేవి తెలిపారు.



ఎన్నిక జరిగే ప్రాంతంలో పరిశీలిస్తున్న ఏఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్పీ, ఎంపీడీవో తదితరులు

తిరుపతి రూరల్ ఎంపీపీ ఎన్నికకు పటిష్ఠ బందోబస్తు

తిరుపతిరూరల్, మార్చి26(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ ఎంపీపీ ఎన్నికకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం 11 గంటలకు మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశమందిరంలో నిర్వహించే ప్రత్యేక సమావేశంలో ఎంపీపీని ఎన్నుకోవాల్సి ఉంది. కోరమ్ ఉంటే సమావేశాన్ని ప్రారంభిస్తామని.. లేదంటే వాయిదావేసి శుక్రవారం ఎన్నిక నిర్వహిస్తామని ఎన్నికల అధికారి జుబేదా చెప్పారు. ప్రత్యేక ఆహ్వానితులుగా ఎంఎల్ఏ, ఎంపీ, ఎమ్మెల్సీ హాజరు కావచ్చన్నారు. బుధవారం ఉదయం ఆమె ఏర్పాట్లను పరిశీలించారు. సీసీ కెమెరాల నిఘాలో.. పోలీసుల బందోబస్తు నడుమ సజావుగా ఎన్నిక నిర్వహిస్తామన్నారు. పరిసరప్రాంతాల్లో 163వ సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఎన్నిక జరిగే ప్రదేశాలను ఏఎస్పీ రవి మనోహరాచారి, రూరల్ డీఎస్పీ శ్రీలత పరిశీలించారు. కాగా, 37 మంది ఎంపీటీసీ సభ్యుల్లో అప్పట్లో 36మంది వైసీపీ తరఫున ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పెరుమాళ్లపల్లె-2లో మాత్రం తేజశ్వి ఇండిపెండింట్‌గా ఎన్నికయ్యారు. విజయానికి 19మంది సభ్యుల మద్దతు అవసరం. ఈనెల20న తిరుపతి నుంచి ముంబై క్యాంప్ వెళ్లిన 32మంది ఎంపీటీసీ సభ్యులు గురువారం ఉదయానికి తిరుపతి చేరుకుని ఓటింగ్‌లో పాల్గొంటారని ఆపార్టీ నేతలు చెబుతున్నారు.

సచివాలయాలే లక్ష్యంగా చోరీలు


గొల్లపల్లి సచివాలయ కార్యదర్శి గది తలుపు గడియను పగలగొట్టడంతో కిందపడి ఉన్న తాళాలు

తిరుపతి రూరల్, మార్చి26(ఆంధ్రజ్యోతి): మండలంలోని సచివాలయాలను లక్ష్యంగా చేసుకుంటూ కొందరు వరుసగా చోరీలకు పాల్పడుతున్నారు. గతేడాది జూన్‌లో మల్లంగుంటలోని సచివాలయంలో కంప్యూటర్లు, సీపీయూ, ప్రింటర్లు దొంగలు తీసుకుపోయారు. ఈఏడాది ఫిబ్రవరి 27న అదే సచివాయంలో మళ్లీ దొంగలు పడ్డారు. దాదాపు రూ.15వేల విలువ చేసే ప్రింటర్‌ని ఎత్తుకెళ్లారు అదేసమయంలో దుర్గసముద్రంలోని సచివాలయంలో రూ.22వేల విలువ చేసే ప్రింటర్ చోరీకి గురైంది. తాజాగా గొల్లపల్లె సచివాలయంలో ప్రింటర్, ఇండక్షన్ స్టౌలను చోరీ చేశారు. దుర్గసముద్రంలో జనావాసాలు పూర్తిగా లేని ప్రాంతంలో సచివాలయం ఉండగా.., మల్లంగుంటలోనూ కొంత దూరంగా ఉంది. గొల్లపల్లెలో గ్రామానికి చివర్లో సచివాలయం ఉంది. దీంతో జనం తక్కువగా సంచరిస్తున్న ప్రాంతాలనే ఎంపిక చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. సచివాలయాల భద్రతకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మూలస్థాన ఎల్లమ్మ ఆలయ హుండీ లెక్కింపు

చంద్రగిరి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మూలస్థాన ఎల్లమ్మ ఆలయం హుండీని బుధవారం లెక్కించారు. ఈ ఏడాది జనవరి 9 నుంచి ఇప్పటివరకు కానుకలను తిరుపతి డివిజన్ తనిఖీదారు ఫణిరాజశయన్ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది లెక్కించారు. ఇందులో రూ.6,21,058 నగదు, 28.600 మిల్లీ గ్రాముల బంగారు, 218.350 మిల్లీ గ్రాముల వెండి వచ్చింది. చెర్లోపల్లెలోని ఆంజనేయస్వామి ఆలయంలో హుండీని లెక్కించగా రూ.1,86,341 నగదు వచ్చింది. మూలస్థాన ఎల్లమ్మ ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, ఈవో మమత, సిబ్బంది పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి: సీపీఐ

తిరుచానూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు గ్రామ లెక్కదాఖలు సర్వే నెంబరు 398/12లో దళితుల భూమిని ఆక్రమించి దాడి చేసిన అధికార పార్టీ వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జయచంద్ర, రూరల్ కార్యదర్శి సుమన్‌లు డిమాండ్ చేశారు. పోలీస్‌స్టేషన్ వద్ద వారు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోర్టుపరిధిలో భూమి ఉందని అయితే దళితులపై దాడి చేయడం దారుణమన్నారు. వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సీఐ సునీల్‌కుమార్‌ను కోరారు.

గ్రామ అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయండి


ప్రణాళికలను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

భాకరాపేట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): గ్రామ అభివృద్ధి ప్రణాళికలు సమగ్రంగా తయారు చేయాలని డీఎల్‌పీవో సురేశ్ నాయుడు అన్నారు. చిన్నగొట్టిగల్లులో పంచాయతీ కార్యదర్శులతో గ్రామ అభివృద్ధి ప్రణాళికలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అవసరమయ్యే ప్రణాళికలు తయారు చేయాలన్నారు. తాగునీరు, మురుగునీటి వ్యవస్థ, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి అవసరమైన నిధులపై నివేదికలో పొందుపరచాలన్నారు. ఈవోపీఆర్‌ఆర్‌డీ సోమశేఖర రెడ్డి, ఏవో సతీశ్ కుమార్, డిజిటల్ అసిస్టెంట్ వెంకటేశ్వర రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పాకాల పంచాయతీకి రూ.38.45 లక్షల ఆదాయం

పాకాల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పాకాల పంచాయతీ కార్యాలయంలో బుధవారం వారపుసంత, దినసరి మార్కెట్, ప్రైవేటు బస్టాండులకు నిర్వహించిన బహిరంగ వేలంపాటల్లో రూ.38,45,000 ఆదాయం లభించింది. వారపుసంత రు.22,45,000, దినసరి మార్కెట్ రూ.12,83,000, ప్రైవేట్ బస్టాండ్ రూ.1,17,000, జంతువధశాల రూ.53,000, కొబ్బరి, చింత చెట్లు రూ.5,400,, షాపింగ్ కాంప్లెక్స్ రూ.47,400కు పాడుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.కస్తూరి, ఈవోపీఆర్డీ శశిరేఖ, పంచాయతీ సెక్రటరీ లావణ్యలత, సిబ్బంది తులసీరామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్ విజేత జ్యోత్స్నకు అభినందన



పాకాల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): షటిల్ బ్యాడ్మింటన్‌లో సత్తాచాటిన స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని జ్యోత్స్నను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ కుమార్, అధ్యాపకులు అభినందించారు. ఎస్ఎస్ ప్రెజెంటర్స్ సంస్థ చెన్నైలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్ బ్యాట్మింటన్ టోర్నీలో జ్యోత్స్న విజేతగా నిలిచారు. కోచ్ బాల శిక్షణలో ఈ విద్యార్థిని రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతగా నిలవడం కళాశాలకు గర్వకారణమని ఆమెను అభినందించారు. కాలేజి వైస్ ప్రిన్సిపాల్ మాశిలామణి, అధ్యాపకులు ఆదిశేఖరరెడ్డి, ఈశ్వర బాబు, రమణమ్మ, విష్ణుప్రియ, వినోద్, మాధవి, నాగమణి పాల్గొన్నారు.

బాలకార్మికులతో పనిచేయిస్తే శిక్షలు తప్పవు


అవగాహన కల్పిస్తున్న ఆనందబాబు

పాకాల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పాఠశాలకు వెళ్లి చదువుకోవాల్సిన బాలల చేత పనులు చేయిస్తే శిక్ష తప్పదని కార్మిక అధికారి కెఆర్ ఆనందబాబు పేర్కొన్నారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా బుధవారం ఆయన పాకాలలో దుకాణాలు, హోటళ్లు, మెకానిక్ షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. బాలకార్మిక వ్యవస్థపై అవగాహన కల్పించారు. బడిఈడు పిల్లలు బడిలో ఉండాలన్నారు. వారిని పనిలో పెట్టుకొని వారి భవిష్యత్తు పాడుచేయవద్దన్నారు.

తిరుమలలో ఆకస్మిక తనిఖీలు


కార్మికులతో మాట్లాడుతున్న అధికారులు

తిరుమల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో బుధవారం టీటీడీ విజిలెన్స్, పోలీసు, ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. కొందరు వ్యక్తులు అనధికారికంగా తిష్ట వేయడం, నిషేధిత వస్తువులను వినియోగిస్తున్న క్రమంలో ఎక్సైజ్ విభాగం డీపీఈవో తనిఖీలు చేపట్టాలని ఆదేశించింది. ఎలాంటి నిషేధిత వస్తువులు లభించని క్రమంలో పలువురు సిబ్బందితో మాట్లాడుతూ నిషేధిత వస్తువులను వినియోగించకూడదని, మద్యం, మాసం, పొగాకు ఉత్పత్తులను వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్సైజ్ సీఐ తిమ్మయ్య, ఎస్ఐ జయశంకర్, విజిలెన్స్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

శ్రీకాళహస్తి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి(55) మృతి చెందాడు. ఈ ఘటన నారాయణపురం పంటపొలాల్లో బుధవారం రాత్రి వెలుగు చూసింది. నారాయణపురం పొలాల్లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్లు స్థానిక రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ రవినాయక్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చ్యురీకి తరలించారు. డీఎస్పీ నరసింహమూర్తి ప్రభుత్వాస్పత్రికి చేరుకుని మృతుడిని పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు కేసు నమోదు చేశారు.

అమ్మవారి భక్తులకు తిరునామధారణ

తిరుచానూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు తిరుమలలో శ్రీవారి సేవకులు దగ్గరుండి తిరునామధారణ చేస్తారు. అయితే తిరుచానూరులో కొంతకాలంగా హాకర్లు అమ్మవారి భక్తులకు తిరునామధారణ చేసిడబ్బులు వసూలు చేసేవారు. దీనిపై డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏవీఎస్వో సతీష్‌కుమార్ దృష్టిపెట్టి శ్రీవారి సేవకులతో భక్తులకు తిరునామధారణ చేస్తున్నారు. హాకర్లకు హెచ్చరించి పంపించేశారు.

బ్యాడ్మింటన్‌లో హోత్రిశ్రీ ప్రతిభ



హోత్రిశ్రీని సన్మానిస్తున్న కళాశాల యాజమాన్య ప్రతినిధులు

చంద్రగిరి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): అనంతపురం జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో కలికిరిలో నిర్వహించిన ఇంటర్ కాలేజియేట్ గేమ్స్ మీట్‌లో మండలంలోని కెఎంఎం కళాశాల విద్యార్థిని టి.హోత్రిశ్రీ ఉత్తమ ప్రతిభ కనబరిచింది. బ్యాడ్మింటన్ మహిళా విభాగంలో సింగిల్స్, డబుల్స్ రెండింటిలోనూ క్రీడా ప్రతిభను ప్రదర్శించి ఛాంపియన్‌గా నిలిచింది. కళాశాల డైరెక్టర్ అరుణకుమార్ ప్రిన్సిపాల్ డాక్టర్ సూరిబాబు, ఈసీఈ బ్రాంచ్ విభాగాధిపతి అనూషలు ఆ విద్యార్థినిని ఘనంగా సత్కరించారు.

అన్నమాచార్య విగ్రహానికి అభిషేకం



తిరుమల, మార్చి26(ఆంధ్రజ్యోతి): తాళ్ళపాక అన్నమాచార్యుల వర్ధంతి సందర్భంగా తిరుమలలోని లేపాక్షి సర్కిల్‌లోని అన్నమయ్య విగ్రహానికి తాళ్ళపాక వంశీయులు బుధవారం ప్రత్యేకాభిషేకం నిర్వహించారు. తాళ్ళపాక రాఘవ, భరద్వాజ్, హయగ్రీవ నారాయాణాచార్యులు, కంచి రాజేష్, ప్రేమ్‌కుమార్, భక్తులు కలిసి ప్రత్యేక తిరుమంజన అభిషేకాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

కారు బోల్తా
ఒకరి పరిస్థితి విషమం



పుత్తూరు అర్బన్, మార్చి 26 (ఆంధ్ర జ్యోతి): పుత్తూరు - చెన్నై జాతీయ రహదారిపై నెం. టీఎన్ 10 ఏవీ 1704 కారు అదుపుతప్పి బోల్తా కొట్టిన ఘటనలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. మిగిలిన నలుగురు చిన్నపాటి గాయాలతో బయటపడ్డారు. పుత్తూరు ఎస్ఐ ఓబయ్య తెలిపిన వివరాల మేరకు... చెన్నై నుంచి తిరుపతికి వెళ్తున్న కారు బుధవారం ఉదయం 10.50 గంటల సమయంలో అదుపుతప్పి గోవిందపాళెం వద్ద డివైడర్‌ను ఢీకొని అవతలి రోడ్డుపై పల్టీలు కొట్టింది. కారు పల్టీ కొట్టే సమయంలో పద్మేష్(18) కింద పడిపోయాడు. దీంతో తల బండరాయికి తగలడంతో తీవ్ర రక్తస్రావం అయింది. స్థానికులు పద్మేష్‌ను సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కారులో ప్రయాణిస్తున్న మరో నలుగురు చిన్నపాటి గాయాలతో తిరుత్తణికి వెళ్లినట్లు తెలిపారు. కారులో ప్రయాణించిన అందరు 19 సంవత్సరాలలోపు యువత కావడం గమనార్హం. వీరంతా చెన్నై సమీపంలోని క్రోంపేటకు చెందిన వారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టెన్త్ పరీక్షకు 26,948 మంది హాజరు

తిరుపతి(విద్య), మార్చి 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం జరిగిన పదవ తరగతి భౌతికశాస్త్రం పరీక్షకు 26,948 మంది విద్యార్థులు హాజరయ్యారు. రెగ్యులర్ విద్యార్థులు 26,902 మంది, ప్రైవేటు విద్యార్థులు 378 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉంది. 26,646 రెగ్యులర్, 302 మంది ప్రైవేటు విద్యార్థులు రాశారు. 256 మంది రెగ్యులర్, 76 మంది ప్రైవేటు విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈవో కేవీఎన్ కుమార్ తెలిపారు

సంస్థలో ఉద్యోగులందరూ సమానులే

● డిస్కం సీఎండీ కె.సంతోషరావు


అధికారులను సన్మానిస్తున్న ముస్లిం ఉద్యోగులు

తిరుపతి(ఆటోనగర్), మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : సదరన్ డిస్కంలో పనిచేస్తున్న ఉద్యోగులందరూ సమానమేనని, అన్ని పండుగలను సంస్థ సమానంగా పాటిస్తుందని సీఎండీ కె.సంతోషరావు పేర్కొన్నారు. తిరుపతి సదరన్ డిస్కం కార్యాలయంలో బుధవారం సాయంత్రం సమావేశ మందిరంలో ముస్లిం ఉద్యోగులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ముస్లిం ఉద్యోగులు రంజాన్ ఉపవాసాలు ఉంటూ విధులు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం సీఎండీతో పాటు సీజీఎం స్థాయి అధికారులను ముస్లిం ఉద్యోగులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్ లక్ష్మీనరసయ్య, పి.అయూబ్‌ఖాన్, ధర్మజ్ఞాని, వరకుమార్, జనార్దన్‌నాయుడు, రమణాదేవి, అసెస్‌మెంట్, విచారణ జనరల్ మేనేజరు ఎం.కృష్ణారెడ్డి, ఈఈలు గంగాధర్‌రెడ్డి, చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

పిడతల కోన ఆయకట్టు చైర్మన్ మృతి

వడమాలపేట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిడతల కోన ఆయుకట్టు చైర్మన్ సోమశేఖర్ రెడ్డి(61) అనారోగ్యంతో మృతి చెందారు. మండలంలోని బంగారెడ్డి కండ్రిగకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు సోమశేఖర్ రెడ్డి అనారోగ్యంతో గత 15 రోజులుగా వేలూరు సీఎంసీలో చికిత్స పొందతూ బుధవారం మృతి చెందారు.

రూ.60కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు

● ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే పులివర్తి నాని



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

తిరుచానూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పార్టీకి కార్యకర్తలే పట్టుగొమ్మలైన కార్యకర్తల సంక్షేమానికి తానెప్పుడూ కట్టుబడి ఉంటానని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. తిరుచానూరు రఘునాథ్‌రిసార్ట్స్‌లోని టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో కష్టపడ్డ కార్యకర్తకు కచ్చితంగా గుర్తింపు లభిస్తుందన్నారు. గడచిన 8 నెలల్లో రూ.60కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులుచేపట్టామన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధివైపు పరుగుతు తీయిస్తున్నారన్నారు. వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సీఆర్ రాజన్ మాట్లాడుతూ టీడీపీ బీసీలకు పెద్దపీట వేస్తోందన్నారు. బ్లూ మీడియా ద్వారా ఎమ్మెల్యే నానిపై చేస్తున్న ఆరోపణలను నిరూపించగలవా అని చెవిరెడ్డికి ఆయన సవాల్ విసిరారు. అంతకుముందు ఎమ్మెల్యే కార్యకర్తలు, ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. పరిష్కారంపై అధికారులతో మాట్లాడారు. సమావేశంలో మండలాల నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ వేలం పాట వాయిదా

●చంద్రగిరిలో వాగ్వాదం


వేలం రద్దు చేయాలంటున్న రమేష్‌రెడ్డి

చంద్రగిరి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పంచాయతీ వేలం పాట వాయిదా పడింది. సర్పంచ్ రూపారామ్మూర్తి అధ్యక్షతన చంద్రగిరి పంచాయతీలో బుధవారం వారపు సంత, కసాయి మార్కెట్ ప్రయివేటు బస్టాండులకు వేలం పాట నిర్వహించాలని భావించారు. వారపు సంతరకు ఇద్దరు, కసాయి మార్కెట్‌కు నలుగురు, బస్టాండుకు ఇద్దరు ధరావతు చెల్లించారు. వారపు సంతకు వేలం పాటలో గురవారెడ్డి, మనోహర్‌లు పోటీపడ్డారు. వీరి అనుచరులు భారీగా చేరుకోవడంతో కొంతసేపు వాదోపవాదాలు జరిగాయి. పోలీసులు వారించినా ఫలితం లేకపోయింది. రూ.24 లక్షల నుంచి వేలం పాట ప్రారంభం కాగా రూ.29,9000 లక్షలు వరకు గురవారెడ్డి పాడగా, అంతలోనే టీడీపీ నాయకుడు రమేష్ రెడ్డి వచ్చి పాట నిలిపేయాలన్నారు. పోటాపోటీగా పాడుకుంటే నష్టపోతారన్నారు. పాటలో పాల్గొన్న ఇరువురునీ మందలించి వెళ్లిపోవాలన్నారు. దీంతో ఎంపీడీవో వెంకటరత్నం వేలం పాటను నిలిపివేశారు. ప్రస్తుత పాటను రద్దు చేస్తున్నామని ప్రకటించారు. శనివారం ఉదయం మరోసారి పాటను నిర్వహిస్తామన్నారు.

జీతాల కోసం పంచాయతీ కార్మికుల నిరసన


నిరసన తెలుపుతున్న కార్మికులు

తిరుపతి రూరల్, మార్చి26(ఆంధ్రజ్యోతి): జీతాలు చెల్లించాలంటూ గాంధీపురం పంచాయతీ కార్మికులు గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసనదీక్ష చేశారు. సచివాలయం ప్రధానగేట్లను మూసేసి రోడ్డుపై భైఠాయించారు. మూడునెలలు గడుస్తున్నా వేతనాలు ఇవ్వలేదని, 13నెలలుగా పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికనేతల జోక్యంతో కార్మికుల జీతాల బిల్లు విషయంలో పంచాయతీ కార్యదర్శి రాజకీయ ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్లు తెలిసింది. 33మంది కార్మికులకు మాత్రమే బిల్లు పెట్టేందుకు కార్యదర్శి సుముఖత చూపుతుండగా.. పనిచేస్తున్న 36మందికీ జీతాలు పెట్టాలని సర్పంచ్ పట్టుబడుతున్నట్లు సమాచారం. దీంతో నిధులు ఉన్నా జీతాలు చెల్లించని పరిస్థితి ఏర్పడిందని తెలిసింది.

ఆకట్టుకున్న సంకీర్తనల గోష్ఠిగానం


సంకీర్తనల గోష్ఠిగానం చేస్తున్న కళాకారులు

తిరుపతి (కల్చరల్), మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తాళ్లపాక అన్నమాచార్యుల 522వ వర్ధంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో నిర్వహించిన సప్తగిరి సంకీర్తనల గోష్ఠిగానం ఆకట్టుకుంది. అన్నమయ్య వంశీయులు చెన్నైకి చెందిన డాక్టర్ తాళ్లపాక మీనలోచని బృందం అన్నమయ్య సంకీర్తనలను సుమధురంగా ఆలపించింది. అన్నమాచార్య ప్రాజెక్టు, స్థానిక కళాకారులు కలిసి ద్వాదశి, సప్తగిరి సంకీర్తనలు, హరికథ, సంగీత సభ ఆహూతులను అలరించింది.

జింకను చంపిన చిరుత!

●ఎస్వీయూ లైబ్రరీ సమీపాన ఘటన ●విద్యార్థులు, ఉద్యోగుల భయాందోళన



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్సిటీ సెంట్రల్ లైబ్రరీ సమీపంలో జింక కళేబరం చూస్తే.. చిరుత చంపినట్టు ఉంది. మంగళవారం రాత్రి ఈ ఘటన జరిగినట్టు భావిస్తున్నారు. బుధవారం ఉదయం గమనించిన విద్యార్థులు సిబ్బందికి చెప్పగా..వాఆరు పరిశీలించారు. ఒక వేళ జింకను కుక్కలు చంపి ఉంటే, ఆనవాళ్ళు ఏమీ మిగిలేవి కాదనీ, చిరుత చంపి ఉండొచ్చని అభిప్రాయపడుతున్నారు. రాత్రి వేళల్లోనూ లైబ్రరీ సమీప ప్రాంతాల్లో పోటీ పరీక్షల కోసం విద్యార్థులు పెద్ద సంఖ్యలో చదువుకుంటూ ఉంటారు. ఈ ఘటనతో భయాందోళన చెందారు. రాత్రి వేళల్లో విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని అధికారులు కోరారు.

విద్యార్థులు సమాజ భవిష్యత్తుకు మూల స్తంభాలు

● సంస్కృత వర్సిటీ వీసీ కృష్ణమూర్తి



మాట్లాడుతున్న వీసీ కృష్ణమూర్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సమాజ భవిష్యత్తుకు విద్యార్థులు మూల స్తంభాలని సంస్కృత యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. ఆ వర్సిటీలో బుధవారం సాయంత్రం హాస్టల్ డే నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ హాస్టళ్లలో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. వసతి, భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేకించి విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించినట్లు తెలిపారు. ఎస్వీయూ వీసీ అప్పారావు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పరుచుకుని లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. హాస్టల్ వార్డెన్ వెంకట్రావు మాట్లాడారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో డిప్యూటీ వార్డెన్లు పరిమిత పండ, జ్యోతి, లీనాచంద్ర, బుల్దీదాస్, ప్రదీప్ కుమార్‌బాగ్, సోమనాథ్‌దాస్, జ్ఞానరంజన పండ, లక్ష్మీనారాయణ, ఉదయ హెగ్డే, అలోక్ మండల్, ఫణివర్మ పాల్గొన్నారు.

విగ్రహాన్ని మరోచోట ఏర్పాటు చేయండి

తిరుపతి(జీవకోన), మార్చి 26(ఆంధ్రజ్యోతి): కరకంబాడీ రోడ్డు ఉపాధ్యాయనగర్‌కు వెళ్లే సర్కిల్‌లో ఎన్టీ రంగారావు విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు కొందరు రోడ్డు మధ్యలో తవ్వుతుండగా అక్కారంపల్లె యువకులు అడ్డుకున్నారు. విగ్రహాన్ని మరోచోట ఏర్పాటు చేసుకోవాలంటూ నిరసన తెలిపారు. కూడలి చాలా చిన్నదని, రోడ్డు మధ్యలో ఇలా ఏర్పాటు చేస్తే వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. విగ్రహాన్ని మధ్యలో కాకుండా రోడ్డు పక్కగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

దారి సమస్యపై ఘర్షణ : నలుగురికి గాయాలు


గాయపడిన చిట్టి భాను- చిట్టి క్రిష్ణయ్య

భాకరాపేట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): దారి సమస్యపై ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో నలుగురికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా.. మండలంలోని చిట్టేవాండ్లపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త చిట్టి క్రిష్ణయ్య పొలానికి, కొంతమంది రైతుల పొలాలకు అదే గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త చిట్టి చెంగయ్య అతని కుటుంబ సభ్యులు పొలాల మీదుగా వెళ్ళాల్సి ఉంది. క్రిష్ణయ్య టీడీపీలోనే కొనసాగుతుండగా, చెంగయ్య వైసీపీలో ఉంటూ, గత ఎన్నికలలో జనసేనలో చేరారు. వీరి మధ్య గతం నుంచే గొడవలున్నాయి. ఈక్రమంలో క్రిష్ణయ్యను తన పొలానికి వెళ్ళనీయకుండా చెంగయ్య అడ్డుకుంటున్నారు. దీంతో క్రిష్ణయ్య, కొంతమంది రైతులు తమ దారి సమస్య పరిష్కరించాలని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో బుధవారం తహసీల్దార్ సిబ్బందితో వెళ్ళి పరిశీలించారు. ఆగ్రహించిన చెంగయ్య , అతని అనుచరులు బుధవారం రాత్రి 10 గంటల సమయంలో కృష్ణయ్య ఇంటిపై రాళ్ళు, కర్రలతో దాడి చేశారు. క్రిష్ణయ్యతో పాటు దాసరి చెంగల్రాయులు, చిట్టి భాను, చిట్టి వెంకట్రామయ్యలను తీవ్రంగా గాయపరిచారు. చెంగల్రాయులు తలకు తీవ్ర గాయమవ్వడంతో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిని చిన్నగొట్టిగల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసును విచారిస్తున్నారు.

ఘనంగా నల్లగంగమ్మ జాతర




ప్రత్యేక అలంకారంలో నల్లగంగమ్మ - వెయ్యి కళ్ల దుత్తలు మోస్తున్న భక్తులు - ఆలయం వద్ద ఎమ్మెల్యే తదితరులు

శ్రీకాళహస్తి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బహదూరుపేటలో బుధవారం నల్లగంగమ్మ జాతర వేడుకగా జరిగింది. తెట్టు వద్ద కొలువై ఉన్న నల్లగంగమ్మ ఆలయంలో జాతరను పురస్కరించుకుని మూడు రోజుల ముందు నుంచే ఆయన నిర్వాహకుడు కంఠా రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు. బుధవారం వేకువజామున ఆలయం నుంచి అమ్మవారి ఉత్సవమూర్తి ఊరేగింపు బహదూరుపేట వరకు సాగింది. తిరిగి అమ్మవారు కంఠా వీధిలో కొలువయ్యారు. రాత్రి నిమజ్జనం వేడుకను వైభవంగా జరిగింది. జాతర సందర్భంగా భక్తులు వేట పొంగళ్ళు, కర్పూరం, కొబ్బరికాయలు, వెయ్యి కళ్ల దుత్తలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే విశ్వబ్రాహ్మణ వీధిలోని నల్లగంగమ్మ ఆలయంలో కూడా జాతర వేడుక జరిగింది. ఈ రెండు ఆలయాలన్నూ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దర్శించుకున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ


చెక్కు అందజేస్తున్న టీడీపీ నేతలు సుగుణమ్మ, నరసింహ యాదవ్, ఆర్సీ మునికృష్ణ

తిరుపతి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి వచ్చిన రూ.1.33లక్షల చెక్కును బుధవారం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి సుగుణమ్మ లబ్ధిదారులకు అందజేశారు. కొర్లగుంటకు చెందిన జి.సత్యనారాయణ అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందారు. కుటుంబ పెద్దను కోల్పోయిన వారి దీన పరిస్థితి గురించి సీఎం కార్యాలయానికి వెళ్లిన విజ్ఞప్తి మేరకు మంజూరైన చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందజేసి ఓదార్పునిచ్చారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ తదితర నాయకులు పాల్గొన్నారు.

● ఇఫ్తార్ విందులో కూటమి నేతలు

షాదీమహల్ వద్ద ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, నాయకులు నరసింహ యాదవ్, ఆర్సీ మునికృష్ణ, చినబాబు, మహేష్ యాదవ్, మైనారిటీ నాయకులు రఫీ, మహబూబ్ బాషా, ఆలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

30న ఉగాది వేడుకలు

తిరుపతి(టీటీడీ), మార్చి 26 (ఆంధ్రజ్యోతి): టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రంలో ఈనెల 30న ఉగాది వేడుకలు నిర్వహించనున్నారు. ఉదయం 9.30 గంటలకు మంగళధ్వని, వేదపారాయణం, పంచాంగ శ్రవణం, అష్టావధానం, టీటీడీ ఉద్యోగుల చిన్నారులకు వేషధారణ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారు.

స్విమ్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


టీటీడీ పరిపాలనా భవనం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

తిరుపతి(టీటీడీ), మార్చి 26(ఆంధ్రజ్యోతి): స్విమ్స్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనం ఎదుట కార్మికులు నిరసన చేపట్టారు. అంతకుముందు ర్యాలీగా ఆస్పత్రి నుంచి పరిపాలనా భవనం వద్దకు చేరుకున్నారు. మురళి మాట్లాడుతూ స్విమ్స్ ఆస్పత్రి ఏర్పడిన నాటినుంచి పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు పెంచలేదన్నారు. వార్డ్ బాయ్స్ పేరును శానిటేషన్ కార్మికులుగా మార్చడం సరైంది కాదన్నారు. కార్మికులకు పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం టీటీడీ జేఈవో వీరబ్రహ్మంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, తిరుపతి నగర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, సుబ్రహ్మణ్యం, బుజ్జి, లక్ష్మి, మునిరాజా, వాసు పాల్గొన్నారు.

ఉగాది పచ్చడి పుస్తకావిష్కరణ



తిరుపతి(కల్చరల్), మార్చి 26(ఆంధ్రజ్యోతి): తిరుపతి సాహితీ సంస్థల ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పుస్తకావిష్కరణ కార్యక్రమం తిరుపతి జిల్లా రచయితల సంఘం కార్యాలయంలో బుధవారం సాయంత్రం నిర్వహించారు. విడుదల చేసిన పుస్తకాలను పాఠశాల చిన్నారులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శతావధాని ఆముదాల మురళి, వివిధ సంస్థల ప్రతినిధులు సాకం నాగరాజు, గార్లపాటి దామోదరం నాయుడు, ఎస్‌జీడీ చంద్రశేఖర్, మన్నవ గంగాధర ప్రసాద్, తోట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్యకు పుష్పాంజలి

తిరుపతి(కల్చరల్), మార్చి 26(ఆంధ్రజ్యోతి): తిరుమల స్వామివారిని స్తుతిస్తూ 32వేల సంకీర్తనలు రచించిన అన్నమాచార్యులు చిరస్మరణీయుడని రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథరెడ్డి అన్నారు. అన్నమయ్య కూడలిలోని అన్నమయ్య విగ్రహానికి పులమాలలు సమర్పించారు. చిగోరా ఆధ్యాత్మిక కేంద్రం వ్యవస్థాపకుడు చిత్తరపు హనుమంతరావు, రంగస్థలి సభ్యులు సుబ్రహ్మణ్యం రెడ్డి, రాజశేఖరరెడ్డి, రవిప్రసాద్, జయంత్‌కుమార్, వాసు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

141 మంది విద్యార్థినులకు స్కాలర్‌షిప్


బాలికలకు స్కాలర్‌షిప్ అందజేస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి అర్బన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ గోల్డ్ అండ్ డైమండ్స్ వ్యాపార సంస్థ మలబార్ 141 మంది పేద విద్యార్థినులకు స్కాలర్‌షిప్ పంపిణీ చేసింది. టౌన్‌క్లబ్ ఎదురుగా ఉన్న మలబార్ షోరూంలో బుధవారం ఉదయం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర కమిషనర్ మౌర్య హాజరై 141 మందికి సంబంధించి రూ.13,04,000 స్కాలర్‌షిప్‌ను చెక్కుల రూపంలో అందజేశారు. ఆమె మాట్లాడుతూ మహిళల సాధికారత, బాలికల చదువుల కోసం సంస్థ ఆదాయంలో 5 శాతం స్కాలర్‌షిప్ రూపంలో అందజేయడం గొప్ప విషమన్నారు. షోరూం హెడ్ రిజీష్ మాట్లాడుతూ ఈ ఏడాది దేశవ్యాప్తంగా 21వేల మంది బాలికల విద్యకు రూ.16కోట్లు తమ సంస్థ కేటాయించిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు, సంస్థ సభ్యులు, విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు గొడుగుల వితరణ



తిరుపతి అర్బన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): చిరు వ్యాపారుల సౌకర్యార్థం జేసీఐ అలుమినిక్లబ్ ప్రతినిధులు మనోహర్ ఆధ్వర్యంలో బుధవారం పెద్ద గొడుగులను అందించారు. చిన్నబజారువీధి, గాంధీరోడ్డు, నాలుగుకాళ్ల మండపం తదితర ప్రాంతాలల్లో ఎండకు మాడిపోతున్న వ్యాపారులను గుర్తించి 45మందికి వితరణ చేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు జి.శంకర్, గుణశేఖర్, రాజేష్, గోపీకేశవన్, కె.పద్మనాభం, కె.కృష్ణమూర్తి, జి.రేవంత్ పాల్గొన్నారు.

బాస్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఉమాపతి

తిరుపతి అర్బన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): భారతీయ అంబేడ్కర్ సేన రాష్ట్ర అధికార ప్రతినిధిగా మంగళం రణధీరపురానికి చెందిన మల్లెమొగ్గల ఉమాపతి నియమితులయ్యారు. తనపై నమ్మకంతో పదవి అప్పగించిన బాస్ వ్యవస్థాపకుడు పి.టి.ఎం.శివప్రసాద్, కేంద్ర కమిటీ ప్రతినిధులు దుర్గం సుబ్బారావు, కె.వి.రమణలకు కృతజ్ఞతలు తెలిపారు. బాస్ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

తిరుపతి

వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు


అధికారులతో సమీక్షిస్తున్న మేయర్ శిరీష

తిరుపతి, మార్చి26 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో నగర ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలని మేయర్ డాక్టర్ శిరీష అధికారులను ఆదేశించారు. బుధవారం కమిషనర్ ఎన్.మౌర్యతో కలసి అన్ని విభాగాల అధికారులతో మేయర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందస్తుగా నీటి ట్యాంకులు ఏర్పాటు చేయాలని, సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పలు చోట్ల నీరు వృథాగా పోతోందని, అరికట్టాలని ఆదేశించారు. వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్ మౌర్య మాట్లాడుతూ తిరుపతి వచ్చే యాత్రికులు ఎండల బారిన పడకుండా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రధాన కూడళ్లలో చలువ పందిళ్లు, గ్రీన్‌మ్యాట్ ఏర్పాటు చేయాలన్నారు. మురుగునీరు నిల్వకుండా, దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు చేపట్టాలని అన్నారు.



మేదిని పూజ నిర్వహిస్తున్న అర్చకులు - రాగి ఆభరణాలను అందిస్తున్న దాతలు

కోదండరాముడి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

తిరుపతి(టీటీడీ), మార్చి 26(ఆంధ్రజ్యోతి): కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలకు బుధవారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. సాయంత్రం 5.30 నుంచి రాత్రి 7 గంటల వరకు వేద ప్రబంధ శాత్తుమొర, 7 నుంచి 8.30 గంటల వరకు సేనాధిపతి ఉత్సవం, మేదినీపూజ, మృత్సంగ్రహణం, అంకురార్పణ చేపట్టారు. గురువారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు సీతాలక్ష్మణ సమేత కోదండరామ స్వామి, ధ్వజపటం, చక్రతాళ్వారులకు తిరువీధి ఉత్సవం నిర్వహించనున్నారు. ఉదయం 9.15 నుంచి 9.30 గంటల మధ్య ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునిశంకరన్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్, ఆలయ అర్చకులు ఆనందకుమార్ దీక్షితులు పాల్గొన్నారు.

రాగి ఆభరణాల బహూకరణ

తిరుపతి కోదండరామాలయానికి రూ.4.10 లక్షల విలువైన బంగారు పూత వేసిన రాగి ఆభరణాలు విరాళంగా అందాయి. చెన్నైకి చెందిన శ్రీధర్, కుటుంబ సభ్యులు ఆరు హస్త కవచాలు, ఆరు పాద కవచాలు ఆలయ డిప్యూటీ ఈవోకు అందజేశారు.

వీధి విక్రయదారులకు జోన్ల కేటాయింపు

తిరుపతి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : నగరంలో వీధి విక్రయదారుల కోసం కేటాయించిన జోన్లలో వ్యాపారాలు చేసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం కమిషనర్ అధ్యక్షతన వీధి విక్రయదారుల టౌన్ వెండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. నగరంలో గ్రీన్, అంబర్, రెడ్ జోన్స్‌గా విభజించామని తెలిపారు.గ్రీన్ జోన్స్ ఉన్న దగ్గర నిరంతర వ్యాపారాలు నిర్వహించవచ్చని, అంబర్ జోన్స్(రిస్ట్రిక్టెడ్ జోన్స్)లో ఉదయం 6నుంచి 10, సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు వ్యాపారం చేసుకోవచ్చన్నారు. రెడ్ జోన్స్‌లో పూర్తిగా వ్యాపారం చేయకూడదన్నారు. 15 రోజుల తర్వాత రీ-సర్వే నిర్వహించి అర్హులైన వీధి విక్రయ దారులకు జోన్స్ అలాట్ చేసి గుర్తింపు కార్డులను, వెండింగ్ సర్టిఫికెట్లను మంజూరు చేస్తామని తెలిపారు. అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, డీసీపీ మహపాత్ర, స్టాండింగ్ కమిటీ మెంబర్ దినకర్, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణ, ఏసీపీ బాలాజీ పాల్గొన్నారు.

నేడు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుపతి(టీటీడీ), మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఈ నెల 30న ఉగాదిని పురస్కరించుకుని గోవిందరాజస్వామి ఆలయంలో గురువారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు ఆలయ శుద్ధి చేయనున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి దర్శనానికి అనుమతిస్తారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి

యూజీసీ చైర్మన్‌కు ఏబీఆర్ఎస్ఎం వినతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 26 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీల్లో సమస్యలను పరిష్కరించాలని యూజీసీ చైర్మన్ మామిడాల జగదీష్‌కు అఖిల భారత శిక్షక్ మహాసంఘ్ (ఏబీఆర్ఎస్ఎం) విన్నవించింది. ఈ మేరకు ఏబీఆర్ఎస్ఎం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ వైవీ రామిరెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కాలేజీలు, యూనివర్సిటీ అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలన్నారు. యూనివర్సిటీల అభివృద్ధికి యూజీసీ ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. గుర్తింపు పొందిన డిగ్రీ, ఇంజినీరింగ్ కాలేజీలకు అటానమస్ నిధులు మంజూరు చేయాలన్నారు. కాలేజీ, యూనివర్సిటీ తాత్కాలిక అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

నేటి నుంచి సంస్కృత విద్యార్థుల ప్రతిభా ఉత్సవాలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 26 (ఆంధ్రజ్యోతి): 3వ అఖిల భారత సంస్కృత విద్యార్థుల ప్రతిభా ఉత్సవాలు గురువారం నుంచి సంస్కృత యూనివర్సిటీ వేదికగా మూడు రోజుల పాటు నిర్వహిస్తారు. ప్రారంభ సభకు సంస్కృత అకాడమీ డైరెక్టర్ ప్రొఫెసర్ పెన్నా మధుసూదన్, వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, ముగింపు సభకు పద్మావతి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ హాజరు కానున్నారు. వివిధ అంశాలపై ప్రతిభా పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నారు.

శాస్త్రవేత్తల జీవితం ఆదర్శం


ప్రసంగిస్తున్న డీజీ రామ్మూర్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సమాజం కోసం అంకితభావంతో కృషి చేసిన శాస్త్రవేత్తల జీవితాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు డీజీ రామ్మూర్తి పేర్కొన్నారు. ఎస్వీయూ ఫిజిక్స్ విభాగంలో బుధవారం నిర్వహించిన డి-కాంటినమ్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంచుకున్న రంగంలో రాణించేందుకు క్రమశిక్షణతో పనిచేయాలన్నారు. నిరంతర సాధన ద్వారా దేన్నైనా సాధించవచ్చని అభిప్రాయపడ్డారు. మరో అతిథి డాక్టర్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశలో విలువైన కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రణాళికను రూపొందించుకుని అమలు చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ పద్మావతి, ఫిజిక్స్ విభాగాధిపతి దేవప్రసాదరాజు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి


భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి (వైద్యం), మార్చి (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. అందులో భాగంగానే ఉద్యోగులకు గత ప్రభుత్వంలో పేరుకుపోయిన రూ.25 వేల కోట్ల బకాయిల్లో రూ.7,230 కోట్లను చెల్లించిందని వెల్లడించారు. ఎస్వీ వైద్య కళాశాల ఆవరణలో ఏపీ హంస ఉద్యోగ సంఘ నేతలకు కేటాయించిన భవనాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్న ఆ భవనం మరమ్మతులకు రూ.20 లక్షలను కేటాయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ హంస ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజా, కార్యదర్శి టాటా బాయి, కోశాధికారి ఇమ్రాన్, జనసేన నేతలు రాజారెడ్డి, లక్ష్మీపతి, ప్రసూతి ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ ప్రసన్న ఠాగూర్ పాల్గొన్నారు.

ప్రవీణ్ మృతిపై విచారణ చేపట్టాలి

తిరుపతి అర్బన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): క్రైస్తవ నాయకుడు పగడాల ప్రవీణ్ మృతిపై విచారణ చేపట్టాలని ఏపీ బిషప్ కౌన్సిల్ చైర్మన్ ఎలమంచలి ప్రవీణ్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. బుధవారం మధ్యాహ్నం హైదరాబాదు నుంచి రాజమండ్రికి ప్రయాణిస్తూ ప్రవీణ్ మృతిచెందిన తీరు అనుమానాస్పదంగా ఉందని, ప్రభుత్వం స్పందించి విచారణ చేపట్టి నిజానిజాలను నిగ్గు తేల్చాలని కోరారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 11 మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), మార్చి 26(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 11మందిపై ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి, బుధవారం తిరుపతి నాలుగవ అదనపు జిల్లా న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ ఎదుట హాజరుపరిచారు. ఒక్కొక్కరికి రూ.10వేలు వంతున 11 మందికి రూ.1.10 లక్షలు జరిమానా విధించారు.

ఎస్వీయూ బాల్ బాడ్మింటన్ మహిళా జట్టు ఎంపిక



తిరుపతి(క్రీడలు), మార్చి 26(ఆంధ్రజ్యోతి) : కేరళ కారైకుడిలోని అలగప్ప విశ్వవిద్యాలయంలో ఈ నెల 29న జరగనున్న ఆలిండియా బాల్‌బాడ్మింటన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నీకి ఎస్వీయూ మహిళా జట్టు ఎంపికైంది. బుధవారం ఎస్వీయూ వ్యాయామ విభాగంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎం.శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్వీయూ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి.పద్మావతి ముఖ్య అతిథిగా హాజరై జట్టుకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. టోర్నమెంటులో రాణించాలని ఆకాంక్షించారు. టీం కోచ్‌గా డాక్టర్ డి.రెడ్డిభాస్కర్, మేనేజర్‌గా ఎ.నరసింహారావు వ్యవహరించనున్నారు.

ముగిసిన ఆహార్య కార్యక్రమం


కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా పద్మావతి యూనివర్సిటీ సంగీత, నృత్య విభాగంలో నిర్వహించిన ఆహార్య (కాస్ట్యూం అండ్ మేకప్) కార్యక్రమం బుధవారం ముగిసింది. కాస్ట్యూం, మేకప్‌పై ప్రతినిధులకు నిపుణులు దేవనర్తకి, శివప్రసాద్ అవగాహన కల్పించారు. మేకప్, కాస్ట్యూంపై శిక్షణ ఇచ్చారు. ముగింపు సభకు వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని, సైన్స్ డీన్ సుధ, రిటైర్డు ప్రొఫెసర్ సరస్వతీ వాసుదేవన్ పాల్గొని మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్‌ను విజయవంతం చేసిన నిర్వాహకులను అభినందించారు. అనంతరం ప్రతినిధులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెడ్ ప్రొఫెసర్ శైలేశ్వరి, వర్క్‌షాప్ కో-ఆర్డినేటర్ డాక్టర్ హిమబిందు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ మరిచారా?


ముసుగులో ఉన్న తెలుగుతల్లి విగ్రహం

తిరుపతి అర్బన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సెంట్రల్ బస్టాండు వద్ద పూర్ణకుంభం కూడలిలో తెలుగుతల్లి విగ్రహావిష్కరణ చేయకపోవడం చర్చకు దారితీస్తోంది. గరుడవారధి నిర్మాణంలో భాగంగా తెలుగుతల్లి విగ్రహాన్ని తొలగించారు. వారధి నిర్మాణం పూర్తయి విశాల కూడలి ఏర్పాటుచేసి ఇప్పటికే పూర్ణకుంభం ఆవిష్కరించారు. అదే ప్రాంతంలో గాయని సుబ్బులక్ష్మి విగ్రహం ఏర్పాటు చేశారు. తెలుగు తల్లి విగ్రహం తెచ్చి ముసుగు వేశారు. దాదాపు నెల కావస్తున్నా పాలకులు గాని, అధికారులు గాని పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా దానిపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

డీఎస్సీ కోచింగ్ ఇవ్వండి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 26 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీకి ఎస్వీయూలో ఉచిత కోచింగ్ ఇవ్వాలని ఏపీ స్టూడెంట్ జేఏసీ కోరింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హేమాద్రియాదవ్, ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు మురళీకృష్ణ వీసీ అప్పారావుకు విన్నవించారు. డీఎస్సీ నోటిఫికేషన్ రానుండటంతో పేద విద్యార్థులు కోచింగ్ తీసుకోలేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుధాకర్, తిరుమలేష్, పవన్, లోకేష్ పాల్గొన్నారు.

తిరుమల క్షేత్రాన్ని విచ్ఛిన్నం చేస్తున్నారు

టీటీడీ మాజీ చైర్మన్ భూమన

తిరుపతి(జీవకోన), మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక తిరుమల క్షేత్రాన్ని ప్రభుత్వం విచ్ఛిన్నం చేస్తోందని టీటీడీ మాజీ చైర్మన్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పాపవినాశనం జలాలను పవిత్రంగా భావిస్తామని, అలాంటి డ్యామ్‌లో బోటింగ్ జరపడం ఏమిటని ప్రశ్నించారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరుగుతున్నందువల్లే బోటింగ్ నిర్వహిస్తున్నట్లు ఫారెస్టు ఉన్నతాధికారి వివేక్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. డ్యాం టీటీడీ పరిధిలో ఉందని, ఈవో, అడిషనల్ ఈవోలు సమాధానం చెప్పాలని అన్నారు. దీనిపై సనాతన వాది పవనానంద స్వామి స్పందించాలన్నారు.

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి


దీక్ష శిబిరం వద్ద మాట్లాడుతున్న సూరిబాబు

తిరుపతి (ఆటోనగర్), మార్చి 26 (ఆంధజ్యోతి): విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని యూనియన్ గౌరవాధ్యక్షుడు డి.సూరిబాబు, డిస్కం కమిటీ ప్రధాన కార్యదర్శి బి.సుమన్ డిమాండ్ చేశారు. తిరుపతి విద్యుత్ సర్కిల్ కార్యాలయం ఎదుట యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్ష బుధవారం మూడవ రోజుకు చేరుకుంది. సంఘీభావం తెలిపిన సూరిబాబు, సుమన్ మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెంచలప్రసాద్, జి.మహేష్, సుబ్రమణ్యం, కుమార్, ఆసిఫ్, రాజశేఖర్, సునీల్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.




చోటా కె నాయుడు, వశిష్ట - జస్టిస్ శివసుబ్రహ్మణ్యం

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. సినీ దర్శకుడు వశిష్ట, సినిమాటోగ్రాఫర్ చోటా కె నాయుడు, నటి దివి, మద్రాసు హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ శివసుబ్రహ్మణ్యం ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



దివి

డీఎస్సీ ఉచిత శిక్షణ వెబ్ ఆప్షన్‌కు రేపు చివరి తేదీ

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 26(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ఉచిత కోచింగ్ కోసం వెబ్ ఆప్షన్ చేసుకునేందుకు శుక్రవారం ఆఖరు తేదీ అని జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అభ్యర్థులు తమ ప్రాధాన్యత ప్రకారం కోచింగ్ సెంటర్‌ను ఎంచుకోవాలని పేర్కొన్నారు. ఫేజ్ 1 అభ్యర్థులకు ఇదివరకు వారు ఎంచుకున్న కోచింగ్ సెంటర్ ప్రాధాన్యత క్రమాన్ని ఎడిట్ చేసుకునే ఆప్షన్ లేదని తెలిపారు. ఫేజ్ 2(ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు) మాత్రమే ఉందని పేర్కొన్నారు. ఫేజ్2లో షార్ట్ లిస్టు అయిన అభ్యర్థులు ప్రాధాన్యత క్రమం ప్రకారం కోచింగ్ సెంటర్లను సంబంధిత పోర్టల్ ద్వారా ఎంపిక చేసుకోవాలని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో సూచించారు.

సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి ఉన్నాయి. క్యూలైన్ ఏటీసీ సర్కిల్ వరకు వ్యాపించింది. ఇక, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.68 కోట్లు
మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 64,252
తలనీలాలు సమర్పించినవారు: 25,943





తిరుపతి శ్రీ కోదండరామాలయం



రాములోరి వేడుకలకు రారండోయ్..

● నేటి నుంచి కోదండరాముడి బ్రహ్మోత్సవాలు

తిరుపతిలోని కోదండ రామాలయంలో గురువారం నుంచి బ్రహోత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఏప్రిల్ 4వరకూ జరిగే ఈ వేడుకల నిర్వహణకు టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసింది. భక్తులకు చలువ పందిళ్లు వేశారు. ఆలయం, మాడ వీధులకు విద్యుద్దీపాలంకరణలు చేశారు. రోజూ ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు, రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు కోదండరామయ్య వాహనాల్లో కొలువుదీరి భక్తులకు దర్శనమిస్తారు. ఈ సందర్భంగా ప్రాచీనమైన తిరుపతి కోదండరామాలయం విశేషాలు..

-తిరుపతి(టీటీడీ), ఆంధ్రజ్యోతి

ప్రాచీన కాలం నాటిది కోదండరామాలయం. విశేష చరిత్ర ఉన్న ఈ ఆలయం తొలినాళ్లలో తిరుపతికి ఉత్తరాన ఉండేది. ఊరు విస్తరించడంతో ప్రస్తుతం నగరం మధ్యన దర్శనమిస్తోంది. ఆలయానికి సంబంధించి అచ్యుతరాయల కాలంలో కుమార రామానుజ అయ్యంగార్ వేయించిన శాసనమొకటి లభించింది. క్రీ.శ.1480లో సాళువ నరసింహుడి కాలంలో శఠగోపదాసర్ నరసింహాచార్య మొదలియార్ కోదండ రామాలయాన్ని జీర్ణోద్ధరణ చేసినట్టు శాసనం ద్వారా తెలుస్తుంది. అంతకుముందే ఆలయంలో స్వామి విగ్రహాన్ని జాంబవంతుల వారు ప్రతిష్ఠించారనేది ఐతిహ్యం. రామచంద్ర పుష్కరిణి ఉన్న ప్రాంతంలో స్వామి, అమ్మవార్ల విగ్రహాలు లభించడంతో జనమేజయ చక్రవర్తి ఆలయంలో తరువాత కాలంలో పునరుద్ధరించారని టీటీడీ పలు పుస్తకాల్లో ముద్రించింది.

తిరుమలను తలపించేలా..

తిరుమలకు, రామచంద్రమూర్తికి అనుబంధముందని ఇతిహాసం చెబుతుంది. రామచంద్రుడు సీతాన్వేషణ సఫలమవ్వడం కోసం స్వామి పుష్కరిణిలో స్నానమాచరించినట్లు, అందుకు గుర్తుగా తిరుమల ఆలయంలో సీతారాముల విగ్రహాలు ఉన్నాయని భవిష్యోత్తర పురాణంలో ప్రస్తావన ఉంది. తిరుమల ఆలయంలోని విగ్రహాలకు జడధారులు ఉండడం గమనించవచ్చు. శ్రీరాముల వారు, ఎక్కడ లేని విధంగా కుడి వైపున సీతాదేవి,ఎడమ వైపున లక్ష్మణ విగ్రహాలు ఉంటాయి. తిరుమల తరహాలోనే కోదండరామాలయంలో స్వామి, అమ్మవార్లు, అర్చనామూర్తులుగా దర్శనమిస్తారు. వైకుంఠ ద్వారాల మాదిరిగానే సువర్ణమయమైన గర్భగుడి ముందు జయవిజయులు ద్వారపాలకులుగా కనిపిస్తారు.

బ్రహ్మోత్సవాల్లో వాహన సేవలు

తేదీ	ఉదయం	రాత్రి
27.03.2025	ధ్వజారోహణం (ఉదయం 9.15 నుంచి 9.30 వరకు)	పెద్దశేష వాహనం
28.03.2025	చిన్నశేష వాహనం	హంస వాహనం
29.03.2025	సింహ వాహనం	ముత్యపుపందిరి వాహనం
30.03.2025	కల్పవృక్ష వాహనం	సర్వభూపాల వాహనం
31.03.2025	పల్లకి ఉత్సవం	గరుడ వాహనం
01.04.2025	హనుమంత వాహనం	గజ వాహనం
02.04.2025	సూర్యప్రభ వాహనం	చంద్రప్రభ వాహనం
03.04.2025	రథోత్సవం	అశ్వవాహనం
04.04.2025	చక్రస్నానం	ధ్వజావరోహణం

టీటీడీ పర్యవేక్షణ

తొలినాళ్ల నుంచి కోదండ రామాలయం స్వతంత్రంగా లేదు. తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా ఉండేది. ఆ ఆలయ అధికారులే దీనిని పర్యవేక్షించేవారు. విజయనగర సామ్రాజ్యంలోని ఉదయగిరి నుంచి వేద పండితులు అర్చకులుగా పనిచేసేవారు. వారి కుటుంబాలకు ఆలయం సమీపంలోనే నివాసవసతి ఉండేది. సువిశాల రాతి గోడలతో, ప్రశాంత వాతావరణంలో ఉండేది. గుడి లోపలి వరుసలో చక్కటి ఉద్యానవనం ఉంది. ఊంజల మండపం, యాగశాల, పోటు వంటివి ఆలయంలోనే నిర్మించారు. ఎత్తయిన రాజగోపురానికి నేరుగా సన్నిధి వీధి చివర దీపస్తంభముండేది. మహంతుల తర్వాత టీటీడీ ఆలయ బాధ్యతలను చేపట్టింది.



బ్రహ్మోత్సవాలకు సిద్ధమైన వాహనాలు



రంగులు అద్దుతున్న కళాకారులు

తిరుమలలో అన్నమయ్య ఇంటిని తిరిగి నిర్మించండి



అన్నమయ్య సంకీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు

తిరుపతి(టీటీడీ), మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో కూల్చివేసిన అన్నమయ్య ఇంటిని తిరిగి నిర్మించి, విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని అన్నమయ్య కళా క్షేత్రం పీఠాధిపతి శ్రీ విజయశంకర స్వామి డిమాండ్ చేశారు. అన్నమయ్య వర్ధంతి సందర్భంగా తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనం ఎదుట హైందవ భక్తి కళా సమ్మేళనం నిర్వహించారు. ఇందులో భాగంగా అన్నమయ్య చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు సంకీర్తనలు ఆలపించారు. అనంతరం టీటీడీ జేఈవో వీరబ్రహ్మంను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బాలసుబ్రహ్మణ్యం, నారాయణ, మహేష్, రజని తదితరులు పాల్గొన్నారు.

సెటిల్‌మెంట్లు.. భూదందాల్లో 'హెడ్'!



● ఎనిమిదేళ్లుగా ఒకే స్టేషన్‌లో తిష్ట

తిరుపతి(నేరవిభాగం), మార్చి 26 (ఆంధ్రజ్యోతి): స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులను బట్టి సెటిల్‌మెంట్లు.. భూదందాలు చేయడంలో ఆయన 'హెడ్' అంట. తిరుపతి సమీపం.. శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిధిలోని ఓ పోలీసు స్టేషన్‌లో ఎనిమిదేళ్లుగా తిష్టవేసిన ఆయనపై తీవ్ర విమర్శలున్నాయి. గత ఐదేళ్లు ఆయన మాటే వేదంగా నడిచింది. అధికారులు సైతం అతడికి అడ్డం చెప్పలేని పరిస్థితులు ఉండేవంటారు. ఎవరైనా అధికారులు ఇతడి అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నిస్తే.. తన పలుకుబడితో వారిపైనే చర్యలు తీసుకునేట్లు చేస్తాడని అంటారు. గతంలో అదే పోలీసు స్టేషన్ నుంచి ఒక అధికారిని ఇతడు బదిలీ చేయించాడంటూ పోలీసు వర్గాలు ఉదాహరణగా చెబుతాయి. ఇక, గత ప్రభుత్వంలో ఇసుక అక్రమ రవాణాకు ఈయన రూట్ అధికారిగా వ్యవహరించాడనే ఆరోపణలున్నాయి. అప్పటి ప్రజాప్రతినిధి చెప్పినట్లు చేస్తూ.. మట్టి, ఇసుక అక్రమ రవాణాలో కీలకంగా వ్యవహరించేవాడని, అలా రూ.కోట్లు వెనకేసుకున్నట్లు విమర్శలున్నాయి. అక్కడ కానిస్టేబుల్ స్థాయిలో రైటర్‌ను నియమించి తెరవెనుక చక్రం తిప్పుతున్నాడని పోలీసులు చెబుతున్నారు. దీంతో ప్రతి ఫిర్యాదుదారు ఈయన్ను కలవాల్సిందేనట. ఈయన చెప్పినట్లు వింటే ఎఫ్ఐఆర్ అవుతుందట. ఎందుకంటే రైటర్ ఉన్నా.. కేసులు నమోదు చేసేది ఈయనేనని అక్కడి పోలీసులు చెబుతున్నారు. ఇక, ఓ దాబాలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డే లేకుండా పోవడం వెనుక ఈయన ప్రమేయం ఉందన్న ఆరోపణలున్నాయి. ఓ భూతగాదాకు సంబంధించి కేసు రెఫర్ (కేసు లేకుండా చేయడం) చేస్తానని 'ఒప్పందం' కుదుర్చుకొని రెండేళ్లయినా చేయలేదంటారు. తన డబ్బు ఇచ్చేయమని ఆ కేసులో నిందితుడు అడగ్గా.. బెదిరిస్తున్నట్లు సమాచారం. ఈ కేసు ఫైలును ఉన్నతాధికారులకు పంపకుండా చేస్తున్నట్లు విమర్శలున్నాయి. ఇలా ఇతడిపై ఎన్ని విమర్శలు, ఆరోపణలు వచ్చినా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. కూటమి అధికారంలోకి వచ్చినా ఆయన దందా మాత్రం యధేచ్ఛగా సాగిపోతోందట. ఇన్ని ఆరోపణలున్న ఇతడు ఎనిమిదేళ్లుగా ఇదే స్టేషన్‌లోనే ఎందుకు ఉన్నారంటూ ఓ ఉన్నతాధికారి ఇటీవల ప్రశ్నించినట్లు తెలిసింది. 'ఇక్కడ పని తెలిసిన వారు ఎవరూ లేరు సార్. ఎఫ్ఐఆర్ అయినా ఆయనొక్కడే రాయగలడు. కేసులు కట్టగలడు' అంటూ అక్కడి అధికారి వత్తాసు పలికినట్లు విశ్వసనీయ సమాచారం.

విచారించి చర్యలు తీసుకుంటాం

ఎనిమిదేళ్లుగా ఒకే చోట పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ అవినీతి ఆరోపణలపై విచారించి చర్యలు తీసుకుంటాం. దీనిపై ఎస్పీకి నివేదిక సమర్పిస్తా. భూతగాదా విషయం నా దృష్టికి వస్తే ఆ ఫైలు పంపాలని ఎస్ఐని ఆదేశించా. - **శ్రీనివాసరావు, రేణిగుంట డీఎస్పీ**



టెక్నాలజీ గురు చంద్రబాబు!

● విజ్ఞానాన్ని విధ్వంసానికి వాడొద్దు ● దేశ ప్రగతికి తోడ్పాటునివ్వండి ● విద్యార్థులకు భువనేశ్వరి దిశానిర్దేశం

కుప్పం/గుడుపల్లె, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): 'చంద్రబాబుగారు విజ్ఞానంతో కూడిన అభివృద్ధిని ఆకాంక్షిస్తారు. అందుకోసమే పరిశ్రమిస్తారు. టెక్నాలజీ రెండువైపులా పదునున్న కత్తివంటిది. దాన్ని విధ్వంసానికి వాడొద్దు. టెక్నాలజీతో దేశ ప్రగతికి తోడ్పడండి.' అని భువనేశ్వరి విద్యార్థులకు పిలుపునిచ్చారు. కుప్పం నియోజకవర్గ పర్యటనలో భాగంగా గుడుపల్లె మండలంలోని అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌ను బుధవారం ఆమె సందర్శించారు. విద్యార్థులతో ముఖాముఖిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేడు అందరికీ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిందన్నారు. అయితే ఆ టెక్నాలజీ వినియోగం గాడితప్పుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వికాసానికి, తద్వారా దేశ ప్రగతికి టెక్నాలజీని వినియోగించుకోవాలని, విధ్వంసానికి దాన్ని వాడొద్దని విద్యార్థులను హెచ్చరించారు. ఇందులో ముఖ్యమంత్రి చంద్రబాబును ఆదర్శంగా తీసుకోవాలన్నారు. నిరంతరం అందుబాటులోకి వస్తున్న విజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అవగాహన చేసుకుంటున్న చంద్రబాబు, తద్వారా ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడానికి, సామాజిక, ఆర్థిక పరిపుష్టికి వినియోగపడేలా ప్రణాళికలు తయారు చేసి అమలు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. విద్యార్థుల్లో సైంటిఫిక్ టెంపర్ ఎప్పుడూ ఉండాలని ఆయన కోరుకుంటారన్నారు. డిజిటల్ యుగంలో టెక్నాలజీని వాడుకోవడం తెలియక కొంతమంది యువత దుర్వినియోగం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మొబైల్ ఫోన్లు, గాడ్జెట్లను ఎంతవరకు వాడుకోవాలో, ఈమేరకు వాటినుంచి లబ్ధిపొంది, అనసరమైనదానికి దూరంగా ఉంచాలో ఎవరికివారు తెలుసుకోవాలన్నారు.

టెక్నాలజీ వాడకం దేవాన్ష్‌కు తెలుసు

టెక్నాలజీని ఎంతమేరకు వినియోగించుకోవాలో, ఎప్పుడు దూరంగా ఉంచాలో తన మనవడు దేవాన్ష్‌కు తెలుసని భువనేశ్వరి చెప్పారు. అధిక సమయం స్ర్కీన్ చూడడంవల్ల చదువుపైన శ్రద్ధ తగ్గి, విద్యార్థుల దృష్టి ఇతరత్రా అనవసరమైన విషయాలపైకి మళ్లుతుందని చివరికి జీవితం గాడి తప్పుతుందని హెచ్చరించారు. 'దేవాన్ష్ ఫోన్లు, ఇతర గాడ్జెట్లు పరిమితంగా మాత్రమే వాడతాడు. అధిక సమయం స్ర్కీన్ ముందు గడపడు. ఓ తల్లిగా చెబుతున్నా, టెక్నాలజీని వికాసానికి మాత్రమే వాడండి' అని భువనేశ్వరి విద్యార్థులకు హితవు పలికారు. గుడుపల్లె మండలంలో అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌కు 1999లో 172 ఎకరాలు కేటాయించడం ద్వారా సాధిస్తున్న మంచి ఫలితాలు ఇప్పుడు చూస్తున్నామన్నారు. ప్రపంచ జనాభాలో రెండవ స్థానంలో ఉన్న భారతదేశం సైన్స్ అండ్ టెక్నాలజీలో మాత్రం 53వ స్థానంలో ఉండడం విచారకమైన విషయమని చెప్పారు. అయితే 2023లో సైన్స్ అండ్ టెక్నాలజీలో పేటెంట్లు పొందడంలో భారత్ 6వ స్థానంలో ఉండడం గర్వకారణమన్నారు. విజ్ఞాన రంగంలో పరిశోధనకు ఎక్కువ నిధులు కేటాయించాలన్నారు. సైంటిఫిక్ టెంపర్ పెంచే విషయంలో విద్యార్థులకు తన మద్దతు పూర్తిస్థాయిలో ఉంటుందని భువనేశ్వరి హామీ ఇచ్చారు.



అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌లో విద్యార్థులతో భువనేశ్వరి

● **చంద్రబాబు కుటుంబ సభ్యులు మీరే**

'ముఖ్యమంత్రి చంద్రబాబుకు నిజమైన కుటుంబ సభ్యులంటే మీరే. మీకోసమే ఆయన తెల్లవారుజాము లేచింది మొదలు, రాత్రి 12గంటల దాకా విరామం లేకుండా పనిచేస్తారు.' అని భువనేశ్వరి అన్నారు. అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌లో భువనేశ్వరి మాట్లాడాక ఒక విద్యార్థిని పైకి లేచి చంద్రబాబు దినచర్య గురించి చెబితే తాము స్ఫూర్తి పొందుతామని అడిగారు. దానికి ఆమె సమాధానమిస్తూ ఏపీని నెంబర్ వన్ స్టేట్ చేయాలన్న తపనతో చంద్రబాబు పనిచేస్తున్నారని చెప్పారు. 'చంద్రబాబుగారు క్రమశిక్షణ కలిగిన వ్యక్తి. ఒక్కోసారి ఆయన రాత్రి ఒంటి గంటదాకా పనిచేస్తారు. అయినా ఉదయం నాలుగు గంటలకే లేచి యోగా, ధ్యానం చేస్తారు.' అన్నారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్య సాధనే ఆయన ధ్యేయమన్నారు. తనకు మొదట్లో రాజకీయాల గురించి పట్టేది కాదన్నారు. హెరిటేజ్ వ్యవహారాలతోపాటు, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు నిర్వహణ నా బాధ్యతలు. చల్లపల్లిలోని ఎన్టీఆర్ మోడల్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులు క్రమశిక్షణకు మారుపేరుగా ఉన్నారని, వారిని చూస్తుంటే తనకు గర్వంగా ఉంటుందన్నారు. క్రమశిక్షణతో చదువులపై దృష్టి పెడితే అద్భుత ఫలితాలు సాధించి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగొచ్చని విద్యార్థులకు భువనేశ్వరి ఉద్బోధించారు.

● **అమ్మానాన్నలే స్ఫూర్తి**

ఎవరికైనా అమ్మానాన్నలే స్ఫూర్తి కావాలని భువనేశ్వరి అన్నారు. తనవరకు తల్లిదండ్రులే స్ఫూర్తిగా నిలిచారని చెప్పారు. 'నాన్నగారు చిన్న వయసులోనే ఇంటింటికీ తిరిగి పాలు అమ్మి, తర్వాత స్కూలుకు వెళ్లేవారు. కుటుంబంకోసం ఆయన పడిన కష్టం చూస్తూ పెరిగినదాన్ని. మేము నిద్రపోయినప్పుడు వచ్చేవారు. మళ్లీ తెల్లారి లేచేటప్పటికి వెళ్లిపోయేవారు. అమ్మ మమ్మల్ని ఎంతో బాధ్యతగా పెంచింది. నాన్న కష్టం, అమ్మ బాధ్యత చూస్తూ పెరిగినవాళ్లం. మీరు కూడా బాధ్యతగా మెలగాలి.మీ తల్లిదండ్రులకు, చదువు చెప్పిన గురువులకు మంచిపేరు తేవాలి' అని భువనేశ్వరి విద్యార్థులకు ఉద్బోధించారు.అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, స్థానిక టీడీపీ నాయకులు, తెలుగు మహిళలు, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



అన్నమయ్య సంకీర్తనలతో పులకించిన సప్తగిరులు

తిరుమల, మార్చి26(ఆంధ్రజ్యోతి): పదకవితా పితామహుడు తాళ్ళపాక అన్నమాచార్య వర్ధంతి సందర్భంగా తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనంలో బుధవారం మలయప్పస్వామి ఊంజల్‌సేవలో నిర్వహించిన సప్తగిరి సంకీర్తనల గోష్ఠిగానంతో సప్తగిరులు పులకించాయి. అహోబిలం మఠాధిపతి శఠగోప రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామిజీ అనుగ్రహ భాషణం చేస్తూ అన్నమయ్యకు, వారి ఆచార్య పీఠమైన అహోబిలం మఠానికి ఎంతో అనుబంధం ఉందన్నారు. అహోబిలం నరసింహస్వామి అనుగ్రహంతో తాళ్లపాక అన్నమాచార్యులు దీక్ష పొంది మంత్రోపదేశం పొందారన్నారు. ఈ మంత్రోపదేశంలో 32 బీజాక్షరాలతో అన్నమయ్య 32 వేల సంకీర్తనలు రచించారన్నారు. స్వామిజీకి టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి శ్రీవారి ప్రసాదాలు అందజేశారు. ముందుగా దినము ద్వాదశి, సప్తగిరి సంకీర్తనల గోష్ఠిగానంలో భాగంగా 'దినము ద్వాదశి నేడు', భావములోనా బాహ్యము, ఎంతమాత్రమునా ఎవ్వరు దలిచిన, పొడగంటిమయ్యా మిమ్ము పురుషోత్తమా, కొండలలో నెలకొన్న కోనేటి రాయుడు వాడు, నారాయణతేనమో.., వంటి కీర్తనలను గానం చేశారు. కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజగోపాల్, దాస సాహిత్య ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి ఆనంద తీర్థాచార్యులు, శ్రీవారి ఆలయ పేష్కార్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం

మంగళం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): వాహనం సహా 10 ఎర్రచందనం దుంగలను జిల్లా అటవీశాఖ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. జిల్లా అటవీశాఖ అధికారి వివేక్‌కు అందిన రహస్య సమాచారం మేరకు అటవీశాఖ అధికారులు బుధవారం తెల్లవారుజామున పంగూరు రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. వెంకటగిరి నుంచి ఏర్పేడు వైపుగా టీఎన్ 31ఏకే 7299 నంబరు గల వాహనం వేగంగా వెళుతుండగా అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఆపకుండా వెళ్లిపోవడంతో అధికారులు వెంబడించారు. స్మగ్లర్లు దర్గిపేరి గ్రామానికి కొంతదూరంలో హైవేపై వాహనాన్ని వదలిపారిపోయారు. అధికారులు వాహనంలో తనిఖీ చేయగా పది ఎర్రచందనం దుంగలు బయటపడ్డాయి. వాహనాన్ని, దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వాహనం సహా వాటి విలువ రూ.5లక్షలు ఉంటుందని వెల్లడించారు. ఈ తనిఖీల్లో డీఆర్వో సికిందర్, ఎఫ్‌బీవోలు పురుషోత్తం, శోభారాణి, వాచర్లు పొన్నయ్య, జితేంద్ర, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న వాహనం, ఎర్రచందనంతో అటవీశాఖ అధికారులు

అగ్నిమాపక శాఖను వేధిస్తున్న వేసవి భయం

సిబ్బంది కొరతతో ఆందోళన ● అత్యవసర పరిస్థితుల్లో అవస్థలు ● గత ఏడాదిలో 61 అగ్నిప్రమాదాలు ● ఉన్నవారితోనే సేవలు




అగ్నిమాపకశాఖ కార్యాలయం, మంటలను అదుపుచేస్తున్న సిబ్బంది (ఫైల్‌ఫొటో)

గూడూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక అగ్నిమాపకశాఖ కార్యాలయంలో కొంతకాలంగా సిబ్బంది కొరత వేధిస్తోంది. గూడూరులో 2010వ సంవత్సరంలో అగ్నిమాపకశాఖ నూతన కార్యాలయ భవనాన్ని నిర్మించారు. రాష్ట్ర విపత్తు, స్పందన, అగ్నిమాపక సేవల శాఖగా ఈ కార్యాలయంలో సిబ్బంది విధులు నిర్వహిస్తూ పలు ప్రమాదాలను నివారిస్తుంటారు. గూడూరు కార్యాలయంలో ఒక ఫైర్ ఇంజిన్ వాహనంతో పాటు ఒక జీపు అందుబాటులో ఉంటుంది. గూడూరు సమీప ప్రాంతాలతో పాటు చిల్లకూరు, మనుబోలు, సైదాపురం, బాలాయపల్లి తదితర ప్రాంతాలలో జరిగే అగ్నిప్రమాదాలను నివారించడం ఇక్కడి సిబ్బంది విధి. ప్రధానంగా వేసవికాలంలో ఎక్కువగా అగ్నిప్రమాదాలు జరుగుతుంటాయి. దీంతో సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాల్సి ఉంటుంది. అయితే గూడూరులోని అగ్నిమాపకశాఖ కార్యాలయంలో తగిన సిబ్బంది కొరత కారణంగా ఉన్న సిబ్బంది అవస్థలు పడాల్సివస్తోంది. ఫైర్‌ఇంజన్ ఉండే ప్రాంతంలో శ్లాబు పెచ్చులూడి ప్రమాదకరంగా మారింది.

ఎంత మంది ఉండాలి..ఎందరు ఉన్నారు?

ప్రధానంగా ఈ కార్యాలయంలో ఒక అగ్నిమాపకశాఖ అధికారి, ముగ్గురు లీడింగ్ ఫైర్‌మ్యాన్‌లు, ముగ్గురు డ్రైవర్లు, ఆపరేటర్లు, తొమ్మిదిమంది ఫైర్‌మ్యాన్‌లు మొత్తం 16 మంది ఉండాల్సి ఉంది. అయితే గతేడాది జూలై నుంచి ఇన్‌చార్జి అగ్నిమాపకశాఖ అధికారి ఉన్నారు. ఫైర్‌మ్యాన్లు నలుగురు మాత్రమే ఉన్నారు. దీంతో ఆరుగురు సిబ్బంది కొరత ఉంది. ఏదైనా భారీ అగ్నిప్రమాదాలను అదుపుచేయాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

ఏడాదిలో 61 ప్రమాదాలు

గతేడాది స్థానిక కుమ్మరవీధిలో ఓ ఫ్యాన్సీ దుకాణంలో అగ్నిప్రమాదం సంభవించిన సమయంలో గూడూరుతో పాటు, కోట, నాయుడుపేట అగ్నిమాపకసిబ్బంది ఒక రోజంతా కష్టపడి మంటలను అదుపుచేయాల్సి వచ్చింది. గత ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు సుమారు 61 అగ్నిప్రమాదాలను సిబ్బంది అదుపు చేశారు. రానున్నది వేసవికాలం కావడంతో ప్రమాదాలను నియంత్రించేందుకు తగిన సిబ్బందిని నియమించాలని పలువురు కోరుతున్నారు. వేసవికాలంలో అగ్నిప్రమాదాలు జరగకుండా ప్రజలు జాగ్రత్తలు తీసకోవాలని, ఏదైనా ప్రమాదాలు జరిగితే వెంటనే 08624-251899 నంబరును కానీ, 101 నంబరుకు కానీ సమాచారం అందిచాలని సిబ్బంది తెలిపారు.

ప్రజాసమస్యలను పరిష్కరించండి



సమావేశంలో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, ఎమ్మెల్యే బీద రవిచంద్ర

గూడూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గపరిధిలోని ప్రజల సమస్యలను త్వరిగతిన పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సూచిం చారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో కలసి గ్రీవెన్స్‌డే నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బుధవారం తన కార్యాలయంలో గ్రీవెన్స్‌డే నిర్వహిస్తామన్నారు. ప్రజా సమస్య లను పరిష్కరించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా మ న్నారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ పేదల సంక్షేమం, అభివృద్ధికి సీఎం చంద్రబాబు ఎంతో కృషిచేస్తున్నారన్నారు. అనం తరం ఎమ్మెల్సీని, ఎమ్మెల్యే సన్మానించారు. ఈ కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, వాటంబేడు శివకుమార్, మట్టం శ్రావణి, ఎల్లసిరి శ్రీనివాసులరెడ్డి, బత్తిన ప్రణీత్, చరణ్ వివిధశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలేరమ్మ జాతరకు చాటింపు



పోలేరమ్మకు కుంభంపోసి చాటింపు చేస్తున్న గ్రామపెద్దలు

నాయుడుపేట టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి: నాయుడుపేట గడియారం సెంటర్ వద్ద వెలసి ఉన్న గ్రామదేవత పోలేరమ్మ జాతరకు మొదటి చాటింపు వేశారు. మంగళవారం అర్ధరాత్రి అమ్మవారి ప్రతిమను తయారుచేసి కుంభం పోసి గ్రామపెద్దల సమక్షంలో మొదటి చాటింపు వేశారు. మే 4న ఘట్టం, 6 తేదీ రాత్రి అమ్మవారి నిలుపు, 7న జాతర నిర్వహించి అదే రోజు రాత్రి అమ్మవారిని సాగనంపనున్నట్లు దేవదాయశాఖ ఈవో రవికృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దకాపు అరవభూమి శ్రీనివాసులురెడ్డి, గ్రామపెద్దలు నానాబాల సుబ్బారావు, నలబోతుల రామారావు, జీవీఆర్ నాయుడు, మస్తాన్, జల, గోపీ, శ్రీనివాసులు, భాస్కర్, కుబేరు మణి, దేవతా చెంచుకిషోర్, శేషం మునిమోహన్‌రావు, మహేష్‌రెడ్డి, యుగంధర్, గణపతి, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ముస్లిం మహిళలకు నిత్యావసరాల పంపిణీ



గూడూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రగతి సేవా సంస్థ కార్యాల యంలో బుధవారం రంజాన్ పండుగను పురస్కరించుకుని పొనకా మల్లి కార్జునరెడ్డి దాతృత్వంతో ముస్లిం మహిళలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ సీనియర్ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, రామ్మోహన్, ప్రభాకర్, రాము, నాగరాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.


చిల్లమానుచేను విలేజ్ క్లినిక్‌లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు



వివరాలు తెలుసుకుంటున్న టాస్క్‌ఫోర్స్ అధికారి శ్రీనివాసులు

ఓజిలి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఓజిలి మండలం చిల్లమానుచేను విలేజ్ క్లినిక్‌ను బుధవారం తిరుపతి జిల్లా డీపీఎంవో డాక్టర్ శ్రీనివాసుల అధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు చేపట్టింది. రోగులతో మాట్లాడి అక్కడ వారికి అందుతున్న వైద్యసేవలపై ఆరాతీశారు. రిజిస్టర్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలపై వైద్య సిబ్బందికి అవ గాహన కల్పించారు. డీఎస్‌వో నాగేంద్రబాబు, డీపీవో ప్రకాష్, వైద్యాధికారులు వినీషా, మాధవ్, సీహెచ్‌వో చలపతి, హెల్త్ సూపర్‌వైజర్ క్రిష్ణవేణి వైద్య సిబ్బంది మస్తాన్, శ్రావణి, కల్పన, హెల్త్ అసిస్టెంట్లు ప్రభాకర్, కన్నా వెంకట రమణ, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు ఉన్నారు.

రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు: బీజేపీ



సమావేశంలో మాట్లాడుతున్న దయాకర్‌రెడ్డి

తడ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఇప్పటి ప్రభుత్వంలో అభివృద్ధి పరుగులు తీస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం అక్కంపేటలో బీజేపీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణాలకు పూర్తి సహకారం అందిస్తోంద న్నారు. ఈ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు చిల్లకూరు తేజారెడ్డి, జిల్లా కోర్ కమిటీ సభ్యులు ఆరణి విజయభాస్కర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదినారాయణరెడ్డి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు విజయమ్మ, నాయకులు వాకి చర్ల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్నుపై 50 శాతం వడ్డీ రాయితీ

వెంకటగిరిటౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఈ నెల 31వ తేదీ లోపు మొత్తం ఆస్తి పన్ను చెల్లించిన వారికి ప్రభుత్వం వడ్డీలో 50 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి బుధవారం తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలో పన్నుల బకాయిలను ఈ నెలాఖరు వరకు 50 శాతం వడ్డీ రాయితీతో ఒకేసారి చెల్లించవచ్చని కమిషనర్ చిన్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

షార్ ఉద్యోగి భార్య ఆత్మహత్య

సూళ్లూరుపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి):షార్ ఉద్యోగి భార్య ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొంది. ఈ ఘటన మంగళవారం సూళ్లూరుపేటలో చోటుచేసుకొంది. పోలీసుల కథనం మేరకు.. షార్‌లో ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న మురళీకృష్ణ సూళ్లూరుపేటలోని షార్ ఉద్యోగుల కాలనీ డీఆర్‌డీఎల్‌లో క్వార్టర్స్ నెం: సీ2-112లో నివాసం ఉంటున్నాడు. విధి నిర్వహణ నిమిత్తం బుధవారం ఉదయం షార్‌కు వెళ్లాడు. సాయంత్రం 7 గంటల సమయం లో ఇంటికి వచ్చేసరికి భార్య రాధిక (31) ఉరేసుకొని మృతి చెంది వుంది. వెంటనే ఆయన పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ బ్రహ్మానాయుడు కాలనీకి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. కాగా రాధిక కొద్దిరోజులుగా ఆరోగ్య సమస్యలతో బాధపతున్నట్లు తెలిసింది. మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతురాలికి పాప, బాబు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్‌కేఆర్ కళాశాలలో రేపు జాబ్‌మేళా

గూడూరు అర్బన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 28వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్ బుధవారం తెలిపారు. నిరుద్యోగయువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలని తెలియజేశారు.

ఫిజియోథెరపీపై అవగాహన ఉండాలి

బాలాయపల్లి, మార్చి 26(ఆంధ్రజ్యోతి) ఫిజియోథెరపీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో వినీల్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయం సమావేశ భవనంలో మండలంలోని సచివాలయాల సిబ్బందికి, పంచాయతీ కార్యదర్శులకు ఫిజియోథెరపీపై 'నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌స్టిట్యూట్ ప్రతినిదులు సతీష్‌కుమార్, ఈవోపీఆర్డీ మోహన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

నిత్య అన్నదానానికి రూ.లక్ష విరాళం

సూళ్లూరుపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయంలో జరుగుతున్న నిత్య అన్నదాన కార్యక్రమానికి గుంటూరుకు చెందిన రవికుమార్ దంపతులు రూ.లక్ష విరాళం అందజేశారు. బుధవారం వారు ఆలయంలో సహాయ కమిషనర్ ప్రసన్న లక్ష్మీకి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి మాజీ సభ్యులు బైరి పార్థసారధి రెడ్డి, పొన్నా కాటయ్య, ఆలయ సిబ్బంది కామేశ్వరరావు తదితరులు ఉన్నారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దండి



విద్యార్థుల నైపుణ్యతను తెలుసుకొంటున్న ఎంఈవో జగదీష్‌బాబు

డక్కిలి, మార్చి 26 : (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను విద్యార్థి దశ నుంచే ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎంఈవో జగదీష్‌బాబు తెలియజేశారు. బుధవారం ఆయన మండలంలోని వెంకటేశ్వరపురం గిరిజన కాలనీలోని ప్రాథమిక పాఠశాలను తనిఖీచేశారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్య అందించాల న్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. హెచ్‌ఎం పెంచలయ్య, ఉపాధ్యాయులు తేజోవర్మ ఉన్నారు.

భూసమస్యలకు శాశ్వత పరిష్కారం

● తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి

పెళ్లకూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి శాశ్వతంగా పరిష్కరించనున్నట్లు తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు శెట్టిగుంట, ఆర్లపాడు, ఊడిపూడి, బంగారంపేట, పెళ్లకూరు, జీలపాటూరు, కానూరు, పెన్నేపల్లి, తాళ్వాయిపాడు గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశామన్నారు. ఆ గ్రామాల్లో జరిగిన రీసర్వే సమస్య లపై గ్రామ సభలు నిర్వహించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేయడంతో పాటు పరిష్కరిస్తున్నామన్నారు.

చలివేంద్రం ప్రారంభం

వాకాడు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : వేసవి తీవ్రత దృష్ట్యా మండల పరిషత్ కార్యాలయంలో చలివేంద్రం ఏర్పాటు చేశామని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈవోపీఆర్‌డీ ఉమామహేశ్వర రావు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్యాలయానికి వివిధ పనులపై వచ్చిన సందర్శకుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

'అధికార దుర్వినియోగం చేస్తున్న కూటమి నాయకులు'

వెంకటగిరిటౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కూటమిలోని నాయకులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని వైసీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి విమర్శించారు. బుధవారం స్థానిక ఎస్‌జేఆర్ భవన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఇసుక, గ్రావెల్, సైదాపురం క్వార్జ్ అక్రమంగా తరలిపోతోందని ఆరోపించారు. వెంకటగిరి వైసీపీ కౌన్సిలర్లు ఏకతాటిపై ఉన్నారని మున్సిపాలిటీలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడితే టీడీపీ అభాసు పాలవుతుందని ఆయన పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే గ్రీవెన్స్ డే



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కనే టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసమే గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ డేలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి అర్జీని పరిశీలించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆ సమస్యను పరిష్కరించేందుకు చొరవతీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, ఏజీ కిషోర్, పచ్చవ మాధవనాయుడు, వేనాటి మురళి రెడ్డి, అలవల శ్రీనివాసులు, గురకల సుబ్రమణ్యం, కృష్ణయ్య, బొమ్మన్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సైనికుల్లా పనిచేయాలి



వెంకన్నపాళెంలో నాయకులు, కార్యకర్తలకు గుర్తింపుకార్డులు పంపిణీ చేస్తున్న మధుయాదవ్

కోట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రతి కార్యకర్తా ఇప్పటి నుంచే సంక్షేమ పథకాలను వివరిస్తూ పార్టీ పటిష్టత కోసం సైనికుల్లా పనిచేయాలని వెంకన్నపాళెం సర్పంచ్, సీనియర్ టీడీపీ నాయకులు మధుయాదవ్ కోరారు. మండల పరిధిలోని వెంకన్నపాళెంలో బుధవారం టీడీపీ సభ్యత్వాలు పొందిన కార్య కర్తలు, నాయకులకు పార్టీ గుర్తింపుకార్డులను పంపిణీ చేశారు. అదే విధంగా పోలింగ్ బూత్‌ల వారీగా బూత్‌కమిటీ అధ్యక్షులకు కొన్ని క్లస్టర్లకు సంబంధించిన గుర్తింపు కార్డుల పంపిణీ చేశారు. వాటిని సభ్యులకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు యరగల వీరయ్యయాదవ్, ఏడుకొండలు తదితరులు ఉన్నారు.

సుఖ సంతోషాలతో రంజాన్ జరుపుకోవాలి



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే విజయశ్రీ, ముస్లిం మైనార్టీ నాయకులు

నాయుడుపేట టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : సూళ్లూరుపేట నియోజక వర్గంలో ముస్లింలు సుఖసంతోషాలతో రంజాన్ పండుగ జరుపుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. పట్టణంలోని షాదీమంజిల్‌లో బుధవారం రాత్రి టీడీపీ యువనాయకులు నెలవల రాజేష్ ముస్లింలకు ఇచ్చిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే విజయశ్రీ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. టీడీపీ నాయకులు రఫీ, నానాబాల సుబ్బారావు, పార్థసారధి, ముస్లింలు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ జాతరకు బస్సుల కొరత



ఆర్టీసీ బస్టాండు వద్ద భక్తులు బస్సుకోసం పాట్లు

సూళ్లూరుపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రతియేటా కనుపూరు ముత్యాలమ్మ జాతరకు సూళ్లూరుపేట ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడపడం ఆనవాయితీ. జాతరకు వారం రోజుల ముందే ఎక్కడెక్కడ నుంచి బస్సులు నడపాలనే విషయంపై ఆర్టీసీ అధికారులు ముందస్తుగానే ప్రకటిస్తుంటారు. ఒకవేళ ఇక్కడి డిపోలో సరిపడా బస్సులు లేకపోయినా పక్కడిపోల నుంచి రప్పించి నడిపేవారు. ఈసారి అలాంటి చర్యలేవి తీసుకోలేదు. డిపో అధికారుల నిర్లక్ష్యంతో కనుపూరు జాతరకు వెళ్లేందుకు బస్సులు లేక భక్తులకు అవస్థలు తప్పలేదు. మంగళవారం నుంచి ప్రత్యేక సర్వీసులు నడపాల్సి ఉంది. బుధవారం మధ్యాహ్నం నుంచి 5 ప్రత్యేక సర్వీసులను మాత్రమే నడిపారు. అవి చాలకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

కోటలో అంబలి చలివేంద్రాలు

కోట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని విద్యానగర్, కోట ప్రాంతాలలో బుధవారం భక్తులకు అంబలి చలివేంద్రాలు ప్రారంభమయ్యాయి. చిల్లకూరు మండలం తూర్పుకనుపూరు ముత్యాలమ్మ అమ్మవారి జాతరను పురస్కరించుకొని ఆయా ప్రాంతాలలో స్వచ్ఛంద సంస్థలు భక్తుల సౌకర్యార్థం కోసం అంబలి చలివేంద్రాలను ఏర్పాటు చేశాయి. పలు ప్రాంతాల నుంచి కోట మీదుగా తూర్పు కనుపూరుకు వెళ్లే భక్తులు అంబలి తాగి సేదతీరారు. జాతరను పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాల్లో అమ్మణ్ణికి భక్తులు పొంగళ్లు పెట్టారు.

ద్విచక్ర వాహనదారుడికి తీవ్రగాయాలు

కోట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ ద్విచక్ర వాహన దారుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని విశ్వనాథపురం అగ్రహారం గ్రామానికి చెందిన గాలి విమలాకర్‌రెడ్డి బుధవారం ద్విచక్ర వాహనంలో సిద్ధవరం నుంచి కోట వైపు వెళ్తున్నాడు. సూళ్లూరుపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కనుపూరు ముత్యాలమ్మ జాతరకు వస్తోంది. ఈ రెండు వాహనాలు కొక్కుపాడు క్రాస్‌రోడ్డు వద్ద ప్రమాదవశాత్తూ ఎదురె దురుగా ఢీకొన్నాయి. ఈ సంఘ టనలో సుధాకర్‌రెడ్డి కాలు విరిగిపోయింది. నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ఎమ్మెల్సీ బీదాకు సన్మానం

నాయుడుపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : రెండోసారి ఎమ్మెల్సీగా నియమితులైన తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీదా రవిచంద్రను నాయుడుపేట టీడీపీ నాయకులు సన్మానించారు. నెల్లూరులోని ఎమ్మెల్సీ బీదా కార్యాలయంలో బుధవారం ఆయనను నాయుడుపేట టీడీపీ నాయకులు శ్రీరాం ప్రసాద్ శాలువా కప్పి సన్మానించారు. సన్మానించిన వారిలో అవధానం సుధీర్, నూరీ, సత్యం తదితరులు ఉన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణ వెబ్ ఆప్షన్‌కు రేపు చివరి తేదీ

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 26 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ఉచిత కోచింగ్ కోసం వెబ్ అప్షన్ చేసుకునేందుకు శుక్రవారం ఆఖరు తేదీ అని జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అభ్యర్థులు తమ ప్రాధాన్యత ప్రకారం కోచింగ్ సెంటర్‌ను ఎంచుకోవాలని పేర్కొన్నారు. ఫేజ్ 1 అభ్యర్థులకు ఇదివరకు వారు ఎంచుకున్న కోచింగ్ సెంటర్ ప్రాధాన్యత క్రమాన్ని ఎడిట్ చేసుకునే ఆప్షన్ లేదని తెలిపారు. ఫేజ్ 2(ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు) మాత్రమే ఉందని పేర్కొన్నారు. ఫేజ్2లో షార్ట్ లిస్టు అయిన అభ్యర్థులు కోచింగ్ సెంటర్లను సంబంధిత పోర్టల్ ద్వారా ఎంపిక చేసుకోవాలని తెలిపారు.

కిక్కిరిసిన తూర్పు కనుపూరు



ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, ఎమ్మెల్సీ బీద రవించద్ర, టీడీపీ సీనియర్ నాయకుడు తానంకి నానాజీకి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న వేదపండితులు



యార, గురునాథస్వామి, అంకమ్మల గ్రామోత్సవంలో వీరతాళ్లతో నృత్యం చేస్తున్న గొల్లలు



పోలేరమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ



వేయికండ్ల కుండను నెత్తిన పెట్టుకుని ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

చిల్లకూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలం తూర్పుకనుపూరు ముత్యాలమ జాతరలో రెండో రోజు భక్తుల రద్దీ మరింత పెరిగింది. పోలేరమ్మను, ముత్యాలమ్మను దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. భక్తుల కోసం ఆలయ ఆవరణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. పలు కంపెనీలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు మంచినీరు, మజ్జిగ, ప్రసాదాలు, అంబలి అందజేశారు. పలువురు అన్నదానాలు చేశారు. డీఎస్పీ గీతాకుమారి బందోబస్తు చేపట్టారు.

ముత్యాలమ్మ సేవలో ఎమ్మెల్యే పాశం, ఎమ్మెల్సీ బీదా

ముత్యాలమ్మను ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర, టీడీపీ సీనియర్ నాయకుడు తానంకి నానాజీలు దర్శించుకున్నారు. జాతరకు వచ్చిన వీరికి వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

డీఎస్సీకి ఉచిత కోచింగ్ ఇవ్వండి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 26 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీకి ఎస్వీయూలో ఉచిత కోచింగ్ ఇవ్వాలని ఏపీ స్టూడెంట్ జేఏసీ కోరింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హేమాద్రియాదవ్, ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు మురళీకృష్ణ వీసీ అప్పారావుకు విన్నవించారు. డీఎస్సీ నోటిఫికేషన్ రానుండటంతో పేద విద్యార్థులు కోచింగ్ తీసుకోలేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుధాకర్, తిరుమలేష్, పవన్, లోకేష్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి

తిరుపతి(ఆటోనగర్), మార్చి 26 (ఆంధజ్యోతి): విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని యూనియన్ గౌరవాధ్యక్షుడు డి.సూరిబాబు, డిస్కం కమిటీ ప్రధాన కార్యదర్శి బి.సుమన్ డిమాండ్ చేశారు. తిరుపతి విద్యుత్ సర్కిల్ కార్యాలయం ఎదుట యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్ష బుధవారం మూడవ రోజుకు చేరుకుంది. సంఘీభావం తెలిపిన సూరిబాబు, సుమన్ మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాయకులు పెంచలప్రసాద్, జి.మహేష్, సుబ్రమణ్యం, కుమార్, ఆసీఫ్, రాజశేఖర్, సునీల్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాస్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఉమాపతి

తిరుపతి అర్బన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): భారతీయ అంబేడ్కర్ సేన రాష్ట్ర అధికార ప్రతినిధిగా మంగళం రణధీరపురానికి చెందిన మల్లెమొగ్గల ఉమాపతి నియమితులయ్యారు.

ఇంటి పట్టాల కోసం వంటావార్పు



తహసీల్దారు కార్యాలయం ముందు వంట వండుతున్న దళితులు

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కనమనంబేడు గ్రామ దళితులకు ఇంటి పట్టాల కోసం 15 రోజులుగా దీక్ష చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమనేఇ సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి విమర్శించారు. తహసీల్దారు కార్యాలయం వద్ద బుధవారం ఇంటి పట్టాల కోసం దీక్ష చేస్తున్న దళితులతో కలిసి వంటావార్పు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సర్వే నెం. 252, 253, 254లో ప్రభుత్వ భూమిని దళితులకు పట్టాలివ్వాలన్నారు. స్థానికేతరుడైన డాక్టర్ బత్తెయ్యనాయుడు 1.75ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని ఫెన్సింగ్ వేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోగా 10మంది దళితులపై కేసులు పెట్టారని వాపోయారు. దళితులకు ఒక్కొక్కరికి 3 సెంట్లు ఇచ్చే వరకు ఆందోళన ఆగదని సీపీఐ సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి చిన్నిరాజ్ చెప్పారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కత్తి రవి, మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

పిడతల కోన ఆయకట్టు చైర్మన్ మృతి

వడమాలపేట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిడతల కోన ఆయకట్టు చైర్మన్ సోమశేఖర్ రెడ్డి(61) అనారోగ్యంతో మృతి చెందారు. మండలంలోని బంగారెడ్డి కండ్రిగకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు సోమశేఖర్ రెడ్డి అనారోగ్యంతో గత 15 రోజులుగా వేలూరు సీఎంసీలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. సోమశేఖర్ రెడ్డి సీతారామపురం సర్పంచుగా, వాటర్‌షెడ్ చైర్మన్‌గా, వైస్ ఎంపీపీగా పనిచేశారు. సోమశేఖర్ రెడ్డి మృతికి ఎమ్మెల్యే భానుప్రకాష్ తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. టీడీపీ నాయకులు ధనంజయులు నాయుడు, ఉమాపతిరావు, దేవ, వెంకటయ్య, హేమాద్రి నాయుడు, షణ్ముగం, చంద్ర తదితరులు సంతాపం తెలిపారు. గురువారం దహనక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.



సోమశేఖర్ రెడ్డి (ఫైల్ ఫొటో)

తూతూమంత్రంగా సామాజిక తనిఖీ సభ

సిబ్బంది తప్ప జనం లేని ప్రజావేదిక

వడమాలపేట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథక సామాజిక తనిఖీ ప్రజా వేదిక వడమాలపేటలో బుధవారం తూతూమంత్రంగా జరిగింది. సిబ్బంది తప్ప ఉపాధి కూలీలు, ప్రజా ప్రతినిధులు వేదికలో పాల్గొనకపోవడం గమనార్హం. 2024-25 ఆర్థిక సంవత్సంలో మండలంలో 754 పనులకు రూ.9.85 కోట్లు ఖర్చు చేయగా అందులో కేవలం రూ.వెయ్యి మాత్రమే అవినీతి జరిగినట్లు తేల్చి రికవరీకి ఆదేశించారు. వడమాలపేట ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బుధవారం జరిగిన ప్రజావేదికలో 20 పంచాయతీల్లో జరిగిన పనులను సామాజిక తనిఖీ బృందం చదివి వినిపించారు. ప్రాజెక్టు డైరక్టర్ శ్రీనివాస ప్రసాద్, ఎంపీడీవో శేషగిరిరావు, ఏపీడీ వరప్రసాద్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.




ప్రజావేదికలో ఖాళీగా ఉన్న కుర్చీలు

ఎన్నాళ్లకెన్నాళ్లకు...

సిమెంట్ రోడ్డు నిర్మాణంతో హర్షాతిరేకాలు

వడమాలపేట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని బంగారెడ్డి కండ్రిగకు వెళ్లే రోడ్డు కొన్నేళ్లుగా గుంతల మయంగా ఉండి ప్రయాణ సమయంలో నరకం చూపేది. ఎన్నికల సమయంలో హామీ మేరకు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చొరవతో గుంతల మయంగా ఉన్న రోడ్డుకు మోక్షం వచ్చింది. బాదూరు రోడ్డు నుంచి వర్షాకాలంలో గ్రామానికి వెళ్లడానికి ఇబ్బందులు అంతాఇంతా కాదు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే చొరవతో రూ.11.25 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మించడంతో గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.





రాస్‌లో ముందస్తు రంజాన్

పుత్తూరు టౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాస్ కార్యాలయంలో రాస్ పొదుపు సంఘాల ఆధ్వర్యంలో రంజాన్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు షౌకత్ అలీ, రహ్మతుల్లా, హబీబ్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. రాస్ అధికారి రవి, సిబ్బంది శేఖర్, తేజ, ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దు

పుత్తూరు అర్బన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పుత్తూరు - చిత్తూరు జాతీయ రహదారిలో జనావాసాల నడుమ మద్యం దుకాణం వద్దని స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. బుధవారం మద్యం దుకాణం ఏర్పాటును అడ్డుకున్నారు. గతంలో ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం సమర్పించామని తెలిపారు. బడి, గుడి, ఆస్పత్రి ఉన్న ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడాన్ని తప్పుబట్టారు. ఇప్పటికైనా అధికారులు మద్యం దుకాణం ఏర్పాటుకు అనుమతి నిరాకరించాలని కోరారు.



మద్యం దుకాణ ఏర్పాటును అడ్డుకుంటున్న స్థానికులు

కారు బోల్తా: ఒకరి పరిస్థితి విషమం

పుత్తూరు అర్బన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పుత్తూరు - చెన్నై జాతీయ రహదారిపై నెం. టీఎస్ 10 ఏపీ 1704 కారు అదుపుతప్పి బోల్తా కొట్టిన ఘటనలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. మిగిలిన నలుగురు చిన్నపాటి గాయాలతో బయటపడ్డారు. పుత్తూరు ఎస్ఐ ఓబయ్య తెలిపిన వివరాల మేరకు... చెన్నై నుంచి తిరుపతికి వెళ్తున్న కారు బుధవారం ఉదయం 10.50 గంటల సమయంలో అదుపుతప్పి గోవిందపాళెం వద్ద డివైడర్‌ను ఢీకొని అవతలి రోడ్డుపై పల్టీలు కొట్టింది. కారు పల్టీ కొట్టే సమయంలో పద్మేష్(18) కింద పడిపోయాడు. దీంతో తల బండరాయికి తగలడంతో తీవ్ర రక్తస్రావం అయింది. స్థానికులు పద్మేష్‌ను సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కారులో ప్రయాణిస్తున్న మరో నలుగురు చిన్నపాటి గాయాలతో తిరుత్తణికి వెళ్లినట్లు తెలిపారు. కారులో ప్రయాణించిన అందరు 19 సంవత్సరాలలోపు యువత కావడం గమనార్హం. వీరంతా చెన్నై సమీపంలోని క్రోంపేటకు చెందిన వారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



మంత్రి అచ్చెన్నాయుడి జన్మదిన వేడుకలు

పుత్తూరు అర్బన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడి జన్మదిన వేడుకలను ఎంటీ రోడ్డులోని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు కార్యాలయం ఎదుట ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. టీడీపీ ఎస్సీ సెల్ కార్యదర్శి ధనపాల్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు పరంధాం, విజయశేఖర్ నాయుడు, పాండురంగయ్య, చంద్రా యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఇక విజయవాడలో మంత్రి అచ్చెన్నాయుడిని పోతుగుంట విజయ్‌బాబు మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



బహిరంగ మద్యపానంపై చర్యలు

శ్రీకాళహస్తి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): బహిరంగ మద్యపానం చేస్తే చర్యలు తప్పవని శ్రీకాళహస్తి 1టౌన్ సీఐ గోపి అన్నారు. బుధవారం పట్టణంలోని ఇసుకదిబ్బ ప్రాంతంలో పోలీసులతో కలిసి పర్యటించారు. అనంతరం అక్కడ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

ఘనంగా నల్లగంగమ్మ జాతర







ప్రత్యేక అలంకారంలో నల్లగంగమ్మ - వెయ్యి కళ్ల దుత్తలు మోస్తున్న భక్తులు - ఆలయం వద్ద ఎమ్మెల్యే తదితరులు

శ్రీకాళహస్తి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బహదూరుపేటలో బుధవారం నల్లగంగమ్మ జాతర వేడుకగా జరిగింది. తెట్టు వద్ద కొలువై ఉన్న నల్లగంగమ్మ ఆలయంలో జాతరను పురస్కరించుకుని మూడు రోజుల ముందు నుంచే ఆయన నిర్వాహకుడు కంఠా రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు. బుధవారం వేకువజామున ఆలయం నుంచి అమ్మవారి ఉత్సవమూర్తి ఊరేగింపు బహదూరుపేట వరకు సాగింది. తిరిగి అమ్మవారు కంఠా వీధిలో కొలువయ్యారు. రాత్రి నిమజ్జనం వేడుకను వైభవంగా జరిగింది. జాతర సందర్భంగా భక్తులు వేట పొంగళ్లు, కర్పూరం, కొబ్బరికాయలు, వెయ్యి కళ్ల దుత్తలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే విశ్వబ్రాహ్మణ వీధిలోని నల్లగంగమ్మ ఆలయంలో కూడా జాతర వేడుక జరిగింది. ఈ రెండు ఆలయాలన్ను ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దర్శించుకున్నారు.

కాళంగి, కళత్తూరు రిజర్వాయర్ల పరిశీలన





కాళంగి గేట్లను, ఓళ్లూరులోని రాయలచెరువును పరిశీలిస్తున్న ఎస్ఈ, ఈఈ, డీఈ, ఏఈలు

కేవీబీపురం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళంగి జలాశయం గేట్లను, జలాశయాన్ని బుధవారం ఎస్ఈ వెంకటేశ్వరరాజు, ఈఈ మదనగోపాల్, డీఈ, ఏఈబాబు పరిశీలించారు. అనంతరం ఓళ్లూరులో గత ఏడాది నవంబరులో తుఫాన్‌కు దెబ్బతిన్న రాయల చెరువు కాలువను, కళత్తూరులో ధ్వంసమైన పెద్ద రిజర్వాయర్‌ను పరిశీలించారు. జలాశయంలో నీటిని నిల్వ ఉంచడం, ఏఏ పనులు చేపట్టాలి, ఏ మేరకు నిధులు అవసరం అవుతాయో చర్చించారు. కాళంగి ఆయకట్టు అధ్యక్షుడు రాజారెడ్డి, ఓళ్లూరు ఆయకట్టు అధ్యక్షుడు బాబు, కళత్తూరు ఆయకట్టు అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, సర్పంచ్ సురేష్, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి సహకరించండి: ఆదిమూలం

కేవీబీపురం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పనిచేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే ఆదిమూలం కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ నిధులను తీసుకువస్తానన్నారు. పథకాల పంపిణీలో రాజకీయ జోక్యం లేకుండా పేదలను గుర్తించాలన్నారు. సర్పంచు బాలాజీ, టీడీపీ నాయకుడు మల్లికార్జుననరెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు బాబుయాదవ్, జనసేన అధ్యక్షుడు థామస్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీహరియాదవ్, ఏఎంసీ మాజీ చైర్మన్ విజయకుమార్‌నాయుడు, మాజీ ఎంపీపీ మణి, కేశవులు నాయుడు, తహసీల్దారు మునిరత్నంరెడ్డి, ఈవోపీఆర్డీ వల్లీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పెరిందేశం గ్రామానికి చెందిన జ్యోత్స్న కుటుంబీకులకు సీఎం సహాయనిధి రూ.84వేలు చెక్కును అందజేశారు. ఇటీవల మరణించిన మాజీ ఎంపీపీ బాలకృష్ణారెడ్డి సతీమణి, ప్రస్తుత పార్లమెంటు యువత అధికార ప్రతినిధి సురేష్‌రెడ్డి తల్లి జయలక్ష్మి కర్మక్రియలకు హాజరయ్యారు.

ఆర్టీసీ బస్సు సర్వీసులు నడపండి

పిచ్చాటూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, ప్రజల సౌకర్యార్థం ఐదు సర్వీసులు నడపాలని ఆర్టీసీ అధికారులను ఎమ్మెల్యే ఆదిమూలం కోరారు. బుధవారం సాయంత్రం తిరుపతి ఆర్ఎం కార్యాలయానికి చేరుకున్న ఎమ్మెల్యే ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సత్యవేడు నుంచి సంతవేలూరు మీదుగా సూళ్లూరుపేట వరకు రోజుకు రెండు సార్లు, పిచ్చాటూరు నుంచి వయా ఎస్ఎస్‌బీ పేట, హనుమంతాపురం మీదుగా దాసుకుప్పం వరకు, సత్యవేడు నుంచి తిరుమలకు నేరుగా, అలాగే ప్రతి రోజు రాత్రి 8 గంటలకు సత్యవేడు నుంచి వరదయ్యపాళెం మీదుగా శ్రీకాళహస్తి వరకు, విద్యార్థుల సౌకర్యార్థం వేసవి సెలవుల అనంతరం శ్రీకాళహస్తి నుంచి దిగువ పుత్తూరు మీదుగా పిచ్చాటూరు వరకు సర్వీసులు నడపాలని కోరారు. ఈ సందర్భంగా ఆర్టీసీ రీజినల్ మేనేజర్ నరసింహులు మాట్లాడుతూ... తప్పకుండా పరిశీలించి, బస్సు సర్వీసులు నడుపుతామని చెప్పారు.



ఆర్ఎంకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే

ప్రజా శ్రేయస్సే సీఎం ధ్యేయం



వినతిపత్రాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్

శ్రీకాళహస్తి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజల శ్రేయస్సే ధ్యేయంగా సీఎం చంద్రబాబు పని చేస్తున్నారని ఎమ్మెల్యే సుధీర్ చెప్పారు. పట్టణంలోని పంచాయతీరాజ్ అతిథిగృహంలో బుధవారం ప్రజావేదిక ద్వారా వినతులు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలను ఎలా పరిష్కరించాలన్న దానిపైనే ఆయన ఎమ్మెల్యేలకు సూచనలు చేస్తుంటారని చెప్పారు. ఆయన స్ఫూర్తితో శ్రీకాళహస్తిలో తరచూ ప్రజావేదిక ద్వారా తాను స్వీకరించిన అర్జీలను పరిష్కరిస్తున్నానని చెప్పారు. టీడీపీ నాయకులు చెంచయ్యనాయుడు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

శ్రీకాళహస్తి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి(55) మృతి చెందాడు. ఈ ఘటన నారాయణపురం పంటపొలాల్లో బుధవారం రాత్రి వెలుగు చూసింది. నారాయణపురం పొలాల్లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్లు స్థానిక రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ రవినాయక్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. డీఎస్పీ నరసింహమూర్తి ప్రభుత్వాస్పత్రికి చేరుకుని మృతుడిని పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు కేసు నమోదు చేశారు.

పురాతన శివాలయం పరిశీలన



ఆవుకు గ్రాసం తినిపిస్తున్న విజయేంద్ర సరస్వతి

శ్రీకాళహస్తి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం తంగేళ్లపాళెంలో ఉన్న వెయ్యేళ్ల నాటి శివాలయాన్ని కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి సందర్శించారు. ఆయనకు మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు స్వాగతం పలికి పాదపూజ చేశారు. ఈ సందర్భంగా విజయేంద్రస్వామి మాట్లాడుతూ.. నూతన ఆలయం నిర్మించడం కన్నా పురాతన ఆలయాన్ని జీర్ణోద్ధారణ చేస్తే ఎంతో పుణ్యమని చెప్పారు. పురాతన ఆయాన్ని పునర్నిర్మించడం పూర్వజన్మ వరప్రసాదమని చెప్పారు. వాయువును నియంత్రించడం ఎంత కష్టమో మనసును నియంత్రించడం అంతే కష్టమని ఇందుకోసం ధాన్యం ద్వారా భగవత్ సంకల్పం చేయాలన్నారు.

మహిళా జూనియర్ కళాశాల స్థలాన్ని కాపాడండి

శ్రీకాళహస్తి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల స్థలాన్ని కాపాడాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు షేక్ జాకీర్ ఎమ్మెల్యే సుధీర్‌ని మర్యాదపూర్వకంగా కలిసి కోరారు. ఈ సందర్భంగా జాకీర్ మాట్లాడుతూ ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలకు మంత్రిగా బొజ్జల గోపాలకృష్ణారెడ్డి హయాంలో సుమారు 7 ఎకరాలు కేటాయించారన్నారు. ఆ స్థలం కొంతభాగం కబ్జాకు గురైందని దానిపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

సైబర్ క్రైం సెక్యూరిటీపై అవగాహన



ఆర్ మల్లవరం పాఠశాలలో జరిగిన సదస్సు

రేణిగుంట, మార్చి 26, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ మల్లవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సైబర్ క్రైం సెక్యూరిటీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథి ఎస్వీయూ ఎంసీఏ విభాగ ప్రొఫెసర్ పీవీ నరసయ్య మాట్లాడుతూ... మొబైల్ ఫోన్, ట్యాబ్, ల్యాప్‌టాప్‌తో ఉపయోగాలతో పాటు నష్టాలున్నాయన్నారు. ప్రొఫెసర్లు అంజన్‌బాబు, విజయలక్ష్మి, ఇన్‌చార్జి హెచ్ఎం వేణుగోపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● సైబర్ క్రైం పట్ల ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని డీఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. బుధవారం మండలంలోని అన్నమాచార్య కళాశాలలో ఆయన రోడ్డు, ఉమెన్ సేఫ్టీ, శక్తి యాప్ తదితరాలపై డిజిటల్ స్క్రీన్‌పై అవగాహన కల్పించారు. సీఐ శరత్‌చంద్ర, ఎస్ఐ అరుణ్ కుమార్, అన్నమాచార్య కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి బేబీ రాణి

శ్రీకాళహస్తి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని శ్రీకాళహస్తి న్యాయస్థాన సీనియర్ సివిల్ జడ్జి బేబీరాణి చెప్పారు. రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం, 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఆదేశాల మేరకు న్యాయ విజ్ఞాన సదస్సుల్లో భాగంగా దిన్నూల్‌లో బుధవారం విద్యార్థులకు పోక్సో చట్టం, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. పోక్సో చట్టం ద్వారా ఏయే నేరాలకు శిక్షలు పడుతాయో వివరించారు. అదే విధంగా ఏదైనా సమస్య ఉంటే అర్జీ రూపంలో ఇస్తే ఉచిత న్యాయసేవ అంది స్తామన్నారు. టోల్‌ఫ్రీ నెం.15100 ద్వారా కూడా న్యాయ సహాయం పొందవచ్చన్నారు. కరస్పాండెంట్ జనార్దనరావు పవార్, హెచ్ఎం విశాల, పారా లీగల్ వలంటీర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.